



ఉత్తమ రైతు పురస్కారాలు అందుకున్న రైతులతో కలెక్టర్ ఆనంద్, డీఏవో, ప్రకృతి వ్యవసాయం డీపీఎం

ప్రకృతి వ్యవసాయానికి రైతులను ప్రోత్సహించాలి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, ఆ దిశగా రైతులను, ప్రజలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్-2025 అమలుపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు అవగాహన కల్పించి, భూమి సారవంతానికి అవసరమయ్యే నవధాన్య విత్తనాలను ఉత్పత్తి చేసి, రైతులకు సరఫరా చేసేలా తోడ్పాటు అందించాలన్నారు. పెరటి తోటల పెంపకంపై ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించి వారికి విత్తనాలు. సాంకేతిక సహకారాన్ని అందించాలని తెలిపారు. మండల, గ్రామ స్థాయిలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అమలుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ఉపయోగాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తదుపరి ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులు వరలక్ష్మి, కళావతి, సుబ్బమ్మ, రామ్మోహన్, వెంగల్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ సమా వేశంలో ప్రకృతి వ్యవసా యం డీపీఎం మాల కొండయ్య, డీఏవో పీ.సత్యవాణి, డీహెచ్‌వో సుబ్బారెడ్డి, ఏపీఎంఐడీ పీడీ శ్రీనివాసులు, డీఆర్డీఏ, వ్యవసాయశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి అమ్మవారిని వివిధ పరిమళ పుష్పాలతో అభిషేకిస్తున్న అర్చకులు

రాజరాజేశ్వరికి స్వర్ణోత్సవ పుష్పయాగం

ఓం చతుర్భుజే చంద్రకళావ్రతం సే కుచోన్నతే కుంకుమ రాగశోణే... పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే నమస్తే నమస్తే జగదేకమాత..' అంటూ అర్చకుల వేద మంత్రాల మధ్య గురువారం రాత్రి నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి సుగంధ పరిమళ పుష్పాలతో వైభవంగా అభిషేకం జరిగింది. నగర నాయకిగా విరాజిల్లుతున్న రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ స్వర్ణోత్సవ (50 ఏళ్ల పూర్తి) వేడుకలు కనులపండువగా జరిగాయి. ఉదయం అమ్మవారికి విశేష నవావరణ పూజలు, పుష్పాలంకరణ జరిగాయి. సాయంత్రం ప్రత్యేకంగా వేసిన పుష్పవేదికపై రాజరాజేశ్వరి విగ్రహం ఏర్పాటు చేశారు. అనంతరం ఉభయదాతలకు ఆహ్వానం, గ్ర్యాహవచనం, గణపతి పూజ, వేదపఠనం, లలితా సహస్ర నామపారాయణంతో పుష్పయాగం నయనానందకరంగా సాగింది. భక్తులు సమర్పించిన పుష్పాలను అమ్మవారికి అభిషేకించారు. ఈ సందర్భంగా కుంభహారతులు, మంత్ర పుష్పం, నివేదన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, వేద పండితులు రామకృష్ణమాచార్యులు, రవిశర్మ, ఇతర అర్చక బృందం నిర్వహించారు. ఉభయకర్తలుగా సన్నపురెడ్డి పెంచలరెడ్డి-పద్మావతమ్మ, వల్లూరు నిషాంత్‌రెడ్డి-స్వాతి, చెన్నూరు శశిధర్‌రెడ్డి-స్వప్న దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కే.జనార్దన్‌రెడ్డి,జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, దాల్‌మిల్ అసోసియేషన్ నాయకులు, వివిధ వాణిజ్య, సంఘాల ప్రతినిధులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉరకలేసి.. విజేతలుగా నిలిచి!

క్రీడల్లో సత్తా చాటిన మహిళా ఉద్యోగులు

నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగినులకు కాస్త ఆటవిడుపు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (ఈ నెల 8న) సందర్భంగా మూడురోజులపాటు ప్రత్యేక అనుమతి లభించడంతో వారిలో దాగిఉన్న క్రీడా ప్రతిభకు పదును పెట్టారు. ఉద్యోగినిగా, గృహిణిగానే కాదు.. క్రీడల్లోనూ తాము ఏమీ తీసిపోమంటూ ఉత్సాహంగా.. ఉల్లాసంగా తలపడ్డారు. తమలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసి వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నలిచారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం మహిళా ఉద్యోగులకు ఉత్సాహంగా క్రీడాపోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి వెంకట శివారెడ్డి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపేందుకు, మానసిక ప్రశాంతత కలిగేందుకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మూడు రోజులు జరిగే ఈ క్రీడల్లో ఉద్యోగినులంతా ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వి.సుజాత, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ కె.శోభారాణి, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆలపర్తి విద్యాసాగర్, మహిళా విభాగం చైర్‌పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ, నిర్వాహక కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర రావు, జిల్లా అధ్యక్షుడు ఎం.పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)







త్రో బాల్ విసురుతూ..

మానులు.. మోడులై!

కంచే చేను మేసిందన్న చందంగా ఉదయగిరి అటవీ శాఖలో కొందరు ఉద్యోగుల తీరు విమర్శలకు తావిస్తోంది. గతంలో వరికుంటపాడు మండలం కనియంపాడు, విరువూరు ప్రాంతాలలో మొక్కలు నాటే క్రమంలో జరిగిన అవినీతి బాగోతం మరువకముందే మరో దందాకు తెరలేపారు. అడిగేవారు లేరన్న ధీమాతో కొంతమంది క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపి తమ శాఖ పరిధిలోని జామాయిల్ చెట్లను నరికించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదంతా తెలిసినా అధికారులు సైతం మౌనం వహిస్తున్నారన్న ప్రచారం జోరుగా నడుస్తోంది.

• అటవీ శాఖలో ఇంటి దొంగల బాగోతం

ఉదయగిరి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లోని అటవీ శాఖకు చెందిన వేలాది ఎకరాల్లో ఉన్న జామాయిల్ చెట్లు తరిగిపోతున్నాయి. ఎవరికీ ఎలాంటి అనుమానాలు రాకుండా టెండర్ల ప్రక్రియను సాకుగా చూపి అక్రమార్కులు వృక్షాలను నరికేస్తు న్నారు. అంతా నిబంధనల ప్రకారమే చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న అటవీ ఉద్యోగులు కొంతమేర టెండరుదారుడికి అప్పగించి మిగిలిన కర్రను గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల వరికుంటపాడు మండలం రామదేవులపాడు భూముల్లో సుమారు రూ. 50 లక్షల విలువైన జామాయిల్ కర్ర మాయమయినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు తమ సిబ్బందిని కాపాడాలనే తాపత్రయంతో నామమాత్రపు విచారణ సాగించి చేతులు దులుపుకున్నట్లు గుసగుసలు వినిపి స్తున్నాయి. అలాగే దుత్తలూరు మండలం నందిపాడులోనూ అలాంటి భాగోతం బయటపడటంతో వీఎస్ఎస్ కమిటీకి కొంత నగదు అందజేసి విషయం బయటకు పొక్కనీయలేదు. అందులోనూ ఇదేమిటని ప్రశ్నించిన కొంతమంది వీఎస్ఎస్ సభ్యులను నయానో, భయానో తమకు అనుకూ లంగా మార్చుకోవడంతో అటవీ ప్రాంతాల్లో ఇంటి దొంగలు అక్రమంగా సాగించే అవినీతి వ్యాపారం బయటకు పాకే అవకాశం లేకుండా పోతోంది.



రామదేవులపాడులో కర్రను నరికివేయడంతో మోడుగా మారిన చెట్లు

• ఉన్నతాధికారులు ఆరా తీస్తేనే..

అటవీ భూముల్లో ఆడిందే ఆట పాటిందే పాటగా మారుతున్న అవినీతి దందాపై శాఖాపరమైన ఉన్నతాధి కారులతో పాటు విజిలెన్స్, సీఐడీ అధికారులు సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. అలాంటి వారిపై చర్యలు చేపట్టకపోతే భవిష్య త్తులో రూ. కోట్లు విలు వ చేసే ప్రభుత్వ సంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉందని కొంతమంది వీఎస్ఎస్ సభ్యులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం బయటకు చెబితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని నోరు మెదిపేం దుకు భయాందోళనలతో వెనకడుగు వేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఏదిఏమయి నప్పటికీ అక్రమార్కుల గుట్టురట్టు చేసి అవినీతి వ్యాపారానికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు చేపట్టాలి

నందిపాడు బీట్‌లోని 30 హెక్టార్లలో జామాయిల్ చెట్ల నరికివేతలో చేతివాటం ప్రదర్శించిన ఉద్యోగులపై చర్యలు చేపట్టాలి. ఏడాది క్రితం 34 లారీల కర్రను తరలించి రికార్డుల్లో మాత్రం కేవలం 16 మాత్రమే చూపిస్తున్నారు. అప్పట్లో లారీల నంబర్లు, స్లిప్పులు కూడా ఇవ్వకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశా. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని కాళ్లా, వేళ్లా పడి బతిమిలాడుకున్న ఉద్యోగులు ప్రస్తుతం అంతా సర్దుబాటు చేసుకొని మీకు ఇష్టమైన చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అప్పటి నుంచి వీఎస్ఎస్‌కు చెందాల్సిన నగదు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- పెంచల్ రెడ్డి, ఎస్సీ, బీసీ వీఎస్ఎస్ చైర్మన్, ఏపిలగుంట

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.22
సహరి (శనివారం) : 5.06

రేపు జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు (లీగల్), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ. యామిని తెలిపారు. జిల్లా కోర్టులో గురువారం మధ్యాహ్నం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజీకి యోగ్యమైన అన్ని రకాల కేసులను ఈ లోక్‌అదాలత్‌లో పరిష్కరిస్తారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా భార్యాభర్తల కేసులు, సివిల్ తగాదాలు, క్రిమినల్, మోటార్ యాక్సిడెంట్, లేబర్ కోర్టు కేసులు వంటివి పరిష్కరిస్తారని ఆమె వివరించారు. ఈ సమావేశంలో ఐదవ అదనపు జిల్లా న్యాయాధికారి సరస్వతి, పోక్సో కోర్టు స్పెషల్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ, సీనియర్ సివిల్ న్యాయాధికారి కరుణ కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే. వాణి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కేదీ ఉపశమనం!

మండుతున్న ఎండలతో ఉపాధి కూలీలు తల్లడిల్లి పోతున్నారు. వేసవికి ముందే భానుడు మండిపోతున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకే నగరం, పట్టణాల్లోని కూడళ్లు, వీధులు దాదాపు ఖాళీ అవుతున్నాయి. ఇలా ఉష్ణోగ్రతుల పెరుగుతున్నా 'ఉపాధి' కూలీలకు వసతులు కల్పించడలో అధికారులు చేతులెత్తేశారు. దీంతో మండుటెండలోనే కూలీలు చెమటలు చిందిస్తూ పనులు చేసి అలసిపోతున్నారు.

- ఉదయగిరి/పలేటివారిపాళెం (ఆంధ్రజ్యోతి)

• జాడలేని మెడికల్ కిట్లు, టార్పాలిన్ • మండుతున్న ఎండలతో కూలీల అవస్థలు

జిల్లాలో సుమారు 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.38 లక్షల మంది కూలీలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సరాసరిన 44 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కూలీలకు నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని విస్మరించింది. ఎండల తీవ్రత పెరుగుతుం డటం, కూలీల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పనులు చేసేందుకు కూలీలు వెనుకంజ వేస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతా లైన ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రి పాడు, అనంతసాగరం, ఆత్మకూరు, కొండాపురం, కలిగిరి తదితర మండ లాల్లో భూమి సైతం గట్టిగా ఉండటం, గడ్డపార దిగకపోవడంతో కూలీలు అధికంగా శ్రమించాల్సి వస్తుంది.

• జాడలేని కిట్లు, టార్పాలిన్

వేసవిలో కూలీలకు పని చేసే ప్రదేశంలో నీడ కోసం టార్పాలిన్ పట్టలు ఏర్పాటు చేయాలి. అలాగే పని చేసే సమ యంలో పొరపాటున గడ్డ పార తగిలి గాయమైతే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉండాలి. అంతేగాక కూలీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలి. నిబంధనల ప్రకారం ఒక్కో శ్రమశక్తి సంఘానికి ఒక టార్పాలిన్, మెడికల్ కిట్లు ఇవాల్సి ఉంది. ఒక్కో సంఘానికి ఇచ్చేది దేవుడెరుక అసలు ఏ ఒక్క పని ప్రదేశంలోనూ మెడికల్ కిట్లు, టార్పాలి న్ పట్టలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచి నీరు లేవు. దీంతో కూలీలు చెట్ల కింద సేద తీరుతు న్నారు.



ఎర్రని ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

చెట్టు లేని ప్రదేశంలో మండు టెండలోనే సేద తీరాల్సిన పరిస్థితి నెలకొంది. కూలీలు తమ ఇళ్ల నుంచే తాగునీరు బాటిల్‌లో తెచ్చుకుంటున్నారు.

• ఊసేలేని గడ్డపారలు

పనుల వద్ద కూలీలు మట్టి తవ్వేందుకు గడ్డపారలు లేవు. కూలీలే తమ సొంత డబ్బులతో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిబంధనల ప్రకారం 20 మంది కూలీలకు కలిపి ఒక శ్రమశక్తి సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటే నాలుగు గడ్డపారలతో పాటు ఒక మెడికల్ కిట్, ఒక టార్పాలిన్ పట్ట ఇవ్వాలి. అయితే, ఇవేమీ ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆదేశాలు జారీ చేశాం

ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యం కల్పించడంతోపాటు ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉంచాలని ఏపీవోలకు ఆదేశాలు జారీ చేశాం. వేసవి దృష్ట్యా కూలీలు పనులకు త్వరగా వెళ్లాలి. ఎండ ముదరకముందే ఇళ్లకు చేరుకుంటే మంచిది.

- గంగాభవాని, డ్వామా పీడీ

'ఉపాధి' భోక్తలపై చర్యలేవీ!?

- వైసీపీ హయాంలో రూ.2.30 కోట్లు స్వాహా
- సామాజిక తనిఖీల్లో వెలుగులోకి..
- రికవరీలో రూ.51.80 లక్షల పెండింగ్
- అవినీతి సిబ్బందిపై చర్యలు శూన్యం

నెల్లూరు (జడ్పీ), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గత వైసీపీ హయాంలో కొంతమంది అధికారులు, సిబ్బంది భారీగా అవినీతికి పాల్పడ్డారు. 2019 నుంచి 2023వ సంవత్సరం వరకు జరిగిన పనుల్లో రూ.2.30 కోట్లు కొంతమంది సిబ్బంది తినేశారు. గత వైసీపీ హయాంలో జిల్లాలోని 37 మండలాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి కొంతమంది ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు అక్రమాలకు తెరలేపారు. ప్రతిరోజూ పనులకు వచ్చే వారికి మాత్రమే వారి బ్యాంకు ఖాతాలో కూలి జమ చేయాల్సి ఉంది. అయితే, కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఎక్కువ మంది కూలీలను లెక్కల్లో చూపి రానివారి కూలి నగదును తమ జేబుల్లో వేసుకున్నారు. అలాగే అలాగే చేసిన పనులకు కొలతలను తీసి దానికి చెల్లించాల్సిన మొత్తాన్ని కూలీలకు జమ చేయాల్సి ఉండగా కొంతమంది టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ కన్సల్ట్‌లు కుమ్మక్కై ఎక్కువ పని చేసినట్లు కొలతల్లో తేడాలు చూపెట్టారు. అలా ఎక్కువ మొత్తంలో కొలతలు చూపి ప్రభుత్వ సొమ్మును దిగమింగేశారు. వీరి అవినీతి వ్యవహారమంతా సామాజిక తనిఖీల్లో బయటపడ్డాయి. గత ఐదేళ్లల్లో రూ.2.30 కోట్ల మేర తినేయడాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ.9.9 లక్షలు జరిమానా విధించారు. అయితే ఇందులో రూ.1.86 కోట్లను రికవరీ చేయగా రూ.51.80 లక్షలు ఇంకా పెండింగ్‌లో ఉంది. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో దుర్వినియోగం అయిన నిధులు రానంటున్నాయి. అలాగే అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులు, సిబ్బందిపై కఠినచర్యలు లేకపోవడంతో పేదల కడుపులు నింపాల్సిన ఉపాధి నిధులు యేటా దుర్వినియోగం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు తీసుకుని అవినీతిపరులపై కఠిన చర్యలు చేపట్టి భవిష్యత్తులో అక్రమాలకు తావులేకుండా ఉపాధి నిధులు పేదలకే అందించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

అంగరంగ వైభవంగా

వెంగమాంబ పల్లకీ సేవ



అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారికి పల్లకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చందనాలంకరం, కుంకుమార్చన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం పల్లకీ సేవ, మహా నైవేద్యం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్ల నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ధర్నాకు అనుమతి ఇవ్వండి



డేటా ఎంట్రీ ఆపరేటర్ లావణ్యకు వినతిపత్రం అందచేస్తున్న అంగన్‌వాడీ కార్య కర్తలు

ఉదయగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10న విజయవాడలో జరిగే మహాధర్నాకు తరలివెళ్లేలా అనుమతి ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డేటా ఎంట్రీ ఆపరేటర్ లావణ్యను కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు.

రహదారుల పక్కన ఇటుకల బట్టీలు

● వాహనదారుల అవస్థలు ● నిబంధనలకు తిలోదకాలు ● పట్టించుకోని అధికారులు



దువ్వూరు వద్ద పంట పొలాల మధ్య ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ



ఇటుక బట్టీలు వెదజల్లుతున్న దుమ్ము, ధూళి మధ్య ప్రయాణిస్తున్న వాహనదారులు

సంగం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రహదారుల పక్కన, పొలాల మధ్య ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తుండడంతో వాటివల్ల వచ్చే దుమ్ము, దూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అంతేగాకుండా కళ్లల్లో దుమ్ము పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అంతేకాకుండా పొలాలు, ఇళ్ళ మధ్య ఏర్పాటు చేయడంతో వాటి ద్వారా వచ్చే పొగ కాలుష్యం వల్ల పంటలకు, ప్రజలకు హాని జరుగుతోంది. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఇటుక బట్టీల వల్ల మానవాళి, పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని గతంలో అటవీశాఖను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు బట్టీల మంజూరు, ఏర్పాటుపై అటవీశాఖ కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. ఆ నిబంధనల మేరకు నిర్వాహకులు ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలి, కానీ నిర్వాహకులు నిబంధనలకు తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతులు లేకుండా ఏర్పాటు

సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, చేజర్ల, మర్రిపాడు తదితర మండలాలతోపాటు జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. వీటికి జిల్లా చిన్నపరిశ్రమల శాఖ నుంచి అనుమతి పొందాలి. జిల్లాలో సుమారు 250 నుంచి 300 పైచిలుకు ఇటుక బట్టీలు ఉన్నాయి. వీటిల్లో పది శాతం మాత్రమే అనుమతులున్నట్లు సమాచారం. పట్టణ ప్రాంతాల్లో కొన్నింటికి అనుమతులున్నా గ్రామీణ ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే ఏర్పాటుచేస్తున్నారు. సంగం మండలంలోని జండాదిబ్బ, దువ్వూరు, పల్లిపాలెం, సంగం గ్రామాల్లో ఇటుకబట్టీలు ఏర్పాటుచేశారు. రవాణాకు సౌకర్యంగా ఉండేలా రహదారుల పక్కనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



మురళీ మృతదేహం

నెల్లూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు, మండలంలోని పొట్టేపాళెంకి చెందిన గొట్టేటి మురళీ (48)కూలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడికి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాగా, వాటిని అధిగమించలేక బుధవారం గ్రామంలోనే ఇంటి వద్ద గడ్డిమందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. గమనించిన స్థానికులు నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. ఆయనకు భార్య పిల్లలున్నారు. అందిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఎంతమేరకు అప్పులు చేసింది తెలియరాలేదు.

రేషన్ దుకాణంపై విజిలెన్స్ దాడులు

● కేసు నమోదు



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సంగం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సంగంలోని ఓ రేషన్ దుకాణంపై విజిలెన్స్ అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ సుభాన్ తన సిబ్బందితో స్థానిక శివాజీ సెంటర్‌లో ఉన్న మూడవ రేషన్ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో రికార్డులను స్వాధీనం చేసుకుని సరుకు నిల్వలను పరిశీలించారు. 50 కేజీల 6 బస్తాల బియ్యం, అరకేజీ చక్కెర ప్యాకెట్లు 43 తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించి 6ఏ కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



కారును ఢీకొన్న మోటార్ బైక్

వెంకటాచలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. వివరాల మేరకు.. ముగ్గురు యువకులు వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు మోటర్ బైక్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. కారు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బుచ్చిలో ఒకరికి...



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలోని జెండాదిబ్బ సెంటర్‌లో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజుపాళెంకు చెందిన శివకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. శివ రాజుపాళెం నుంచి బైక్‌పై దువ్వూరుకు వెళ్తుండగా జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివకు తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నేషనల్‌హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కలిగిరిలో పూరిల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కలిగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రతోట కాలనీలోని నాటకరాణి రమణమ్మ (70) వృద్ధురాలికి చెందిన పూరిల్లు గురువారం రాత్రి 9గంటల సమయంలో ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. స్థానికుల వివరాలు మేరకు.. రమణమ్మ వంటపని ముగించుకొని పక్కనే ఉన్న మరో ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటిలో నుంచి ఒక్కసారిగా ఉవ్వెత్తున మంటలు రావడాన్ని గమనించి స్థానికులు అప్రమత్తం అయ్యారు. మంటలు ఆర్పేందుకు యత్నించారు. ఇంటిలోని గ్యాస్ సిలిండర్‌ను బయటకు తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటల్లో బియ్యం, రూ.20వేల నగదు, రూ.2లక్షలకు పైగా విలువైన ప్రామిసరి నోట్లు, బీరువా, బట్టలు సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. బాధితురాలికి భర్త చనిపోగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఒక్క కుమార్తె స్థానికంగా ఉండగా మిగిలిన వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. పింఛను నగదు కూడా మంటల్లో కాలిపోయిందని, కట్టుబట్టలతో మాత్రమే తాను మిగిలానని, తనను ఆదుకోవాలని బాధితురాలు బోరున విలపించింది. ప్రమాదం జరగ్గానే విషయం తెలుసుకుని విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపివేసి ఘటనా స్థలానికి వచ్చి జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకుని వింజమూరు నుండి ఫైర్ ఇంజన్ ఘటనా స్థలానికి వచ్చేసరికి మంటలను అదుపులోకి తెచ్చారు. ఫైర్ ఆఫీసర్ చంద్రమౌళి, హెడ్‌కానిస్టేబుల్ రమేష్ వివరాలు నమోదు చేశారు.

బీఈడీ పరీక్షల్లో ఒకరి డీబార్

వెంకటాచలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో ఒకరు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 1242 మంది విద్యార్థులకు 1137 మంది హాజరు కాగా 105 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నెల్లూరులోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 532 మంది గైర్హాజరు

విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో 532 మంది గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలలో 75 మందికి 57 మంది హాజరు కాగా మిగిలిన 18 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8805 మంది విద్యార్థులకు 8291 మంది హాజరు కాగా 514 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

నూరు శాతం రుణాల రికవరీకి కృషి

● ఎన్.రవిశంకర్‌రెడ్డి, ఏపీఎం



సంగం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదుపు సంఘాల సభ్యుల నుంచి రుణ రికవరీ నూరు శాతం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీఎం రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

? మండలంలో ఎన్ని పొదుపు సంఘాలున్నాయి. వాటిల్లో సభ్యులు ఎంత మంది ఉన్నారు. సంఘాలకు బ్యాంక్ లింకేజీ లక్ష్యం ఎంత.

! మండలంలోని 20 పంచాయతీల్లో 991 సంఘాలున్నాయి. వాటిల్లో 10,004 మంది సభ్యులుగా ఉన్నారు. 2024-25 ఏడాదికి 756 సంఘాలకు బ్యాంక్ లింకేజీ లక్ష్యం రూ. 31.5 కోట్లు.

? ఇప్పటి వరకు ఎన్ని సంఘాలకు ఎంత బ్యాంక్ లింకేజీ ఇప్పించారు. ఎంత శాతం రికవరీ ఉంది.

! మండలంలో 411 సంఘాలకు ఇప్పటి వరకు రూ. 25.61 కోట్ల మేర బ్యాంక్ లింకేజీ అందచేశారు. మార్చి నెలాఖరులోపు పూర్తి చేస్తాం. రికవరీ 98.7 శాతం ఉంది.

? స్త్రీ నిధి కింద ఎంతమందికి రుణాలు ఇచ్చారు. రికవరీ శాతం ఎంత. ఒక్కొక్కరికి ఎంత రుణం ఇచ్చారు.

! మండలంలో 1000 మంది సభ్యులకు రూ. 5 కోట్ల రుణం ఇవ్వాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 424 మందికి రూ. 2.72 కోట్ల మేర రుణాలు అందచేశాం. రికవరీ 93 శాతం ఉంది. ఒక్కొక్కరికి వారు ఏర్పాటుచేసే యూనిట్‌ను బట్టి రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు రుణం ఇచ్చాము.

? పొదుపు సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీలకు ఎంతమందికి ఉన్నతి పథకం కింద రాయితీ రుణాలు అందచేశారు.

! గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి పథకంలో రుణాలు ఇవ్వలేదు. తాను బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల్లోనే ముగ్గురికి ఉన్నతి పథకంలో రుణాలు ఇచ్చి లక్ష్యం పూర్తి చేశాం.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు



స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న లైన్‌మెన్లు

ఉదయగిరి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండి పాళెం గ్రామ మసీదు వీధిలో ఎప్పటినుంచో నేలకొరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో గురువారం నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి కథనానికి స్పందించిన ఉదయగిరి ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ ఖుద్దూస్‌బాషా ఆదేశాల మేరకు సబ్‌డివిజన్ జేఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం లైన్‌మెన్లు వెంకట్రావు, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు ఆ ప్రాంతంలో స్తంభాన్ని ఏర్పాటుచేసి తాత్కాలికంగా ఉన్న సర్వీసులను యధావిధిగా కొనసాగించారు. వీధి దీపాన్ని సైతం అమర్చడంతో సమీప నివాసాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గ్రామానికి చెందిన నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం సైతం తన వంతుగా సహకారం అందించారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సంగం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో పాల్గుణ మాసం శుద్ధషష్ఠిని పురస్కరించుకుని బుధవారం అర్ధరాత్రి శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. నూతనంగా తయారుచేయించిన ఉత్సవ విగ్రహాలను వేద పండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యా నడుమ మహాసంప్రోక్షణ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెరుమాళ్ల రవీంద్రబాబు, వెన్నా శ్రీనివాసులురెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న జనసైనికులు

ఆత్మకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్ల జగన్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ దూషిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని, కనీసం 10 శాతం సీట్లు లేని పార్టీని ప్రతిపక్ష పార్టీగా గుర్తించాలని కోరడం సిగ్గు చేటన్నారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలే తిరస్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోపాటు మంచి అలవాట్లను నేర్పించాలి



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

ఉదయగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు మంచి అలవాట్లు, నైతిక విలువలు నేర్పించాలని ఎంఈవో షేక్ మస్తాన్ వలి సూచించారు. గురువారం మండలంలోని కొండాయపాళెం, వెంకట్రావుపల్లి ప్రాథమి క పాఠశాలలను సందర్శించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు ప్రార్థనా సమయానికి వచ్చేలా చూడాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయిన కారు

● తప్పిన ప్రమాదం



రహదారి పక్కన డ్రైనేజీ కాలువలోకి దూసుకుపోయిన కారు

సంగం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై దువ్వూరు దాటిన తరువాత వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కన డ్రైనేజీ కాలువలోకి దూసుకుపోయిన సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. కారు ఆత్మకూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వేగంగా వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రహదారి పక్కన కాలువలోకి దూసుకుపోయింది. కారులోని ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో వారు వేరే వాహనంలో వెళ్లిపోయారు. వారి వివరాలు తెలియరాలేదు. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు.

సోమశిలలో 57.330 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 57.330 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 1,950, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 100, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

అనంతసాగరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల గ్రామానికి చెందిన ఓ బాలిక గురువారం ఉదయం అదృశ్యమైంది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సోమశిల దక్షిణ కాలువకు గండి

● యుద్ధప్రాతిపదికన పూడ్చేందుకు మంత్రి ఆనం ఆదేశాలు



గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి

చేజర్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ నుంచి చేజర్ల పెద్ద చెరువుకు నీరు వెళ్లే కాలువకు గురువారం తెల్లవారుజామున గండి పడింది. ఈ గండి వలన చేజర్ల పెద్దచెరువుకు నీరు ఉధృతంగా వస్తుండడంతో ఉదయాన్నే కాలువ మీదకు వెళ్ళి పరిశీలించిన రైతులు గండి పడి ఉండడం గమనించి సోమశిల అధికారులకు సమాచారం ఇచ్చారు. అదే విషయం నీటి సంఘం అధ్యక్షుడు రావి కృష్ణారెడ్డి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, ఈఈ మల్లికార్జున, డీఈ విజయబాబు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే పైనుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని పూర్తిగా తగ్గించారు. కాలువకు పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం తగ్గగానే గండిని పూడ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు త్వరితగతిన పూర్తిచేయండి : ఎంపీడీవో



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆత్మకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని కరటంపాడు సచివాలయంలో జరుగున్న ఇంటింటా పీ4 సర్వేను పరిశీలించారు. సర్వేపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీ4 సర్వే ఇప్పటి వరకు 86 శాతం పూర్తయిందని, మిగిలిన సర్వేను త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వర్క్ ఫ్రం హోం సర్వే కూడా వెంటనే పూర్తిచేయాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి షఫీ, సిబ్బంది ఉన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ

మండలంలోని కరటంపాడులో ఎల్‌టీసీ కేంద్రంలో అనంతసాగరం మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు గురువారం చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో చెత్త సేకరణ, ఆ తరువాత తడి, పొడి చెత్త వేరు చేయు విధానం, వర్మీ కంపోస్టు తయారీ విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎం ఆస్తులపై అసత్య ప్రచారం చేస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న కాకి శ్రీనివాసులు

ఉదయగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలో గల ఏబీఎం ఆస్తులపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్టీబీసీ, పీఏబీసీ లాఅధికారి కాకి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏబీఎం చర్చి ఆవరణలో పాస్టర్లు, సంఘ పెద్దలతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ మద్రాసు హైకోర్టు క్రిస్టియన్ ఆస్తులపై ఓ కమిటీ వేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ కమిటీని ఇంకా నియమించలేదని, నియమించిన తరువాత ఆస్తులను పరిశీలించి కోర్టుకు నివేదిక ఇస్తుందన్నారు. అనంతరం కోర్టు తీర్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే కొంతమంది గ్రూపులుగా ఏర్పడి ఈ ఆస్తులు తమవని, మేము అమ్ముతామని అనవసరమైన ప్రసంగాలు చేయడం మంచిది కాదన్నారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఆనందరావు, జాషువా, అరోన్, కాకి ప్రసాద్, ఇమ్మానియేలు, పాస్టర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోలీసు వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్ర సేనారెడ్డి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్ అంటే ఏమిటి, ఎలా నమోదు చేస్తారు, లాకప్ గది, ఆయుధాలు, బుల్లెట్లు, పోలీసుల పనితీరు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా అత్యవసరమైతే డయల్ 100కు కాల్ చేయవచ్చన్నారు. పోలీసులు ఫ్రెండ్లీ పోలీసులుగా పనిచేస్తున్నారన్నారు. అన్యాయం జరిగితే నిర్భయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వింజమూరు మండలంలో బెల్టు షాపుల జోరు

వింజమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మద్యం బెల్ట్‌షాపులు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లోని కూల్‌డ్రింక్ షాపులు మందుబాబులకు అడ్డాగా మారాయి. ఈ షాపుల్లో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మేవారు కొందరైతే మోటార్‌సైకిల్‌పై మద్యం సీసాలు పెట్టుకుని అడిగిన చోటికి తెచ్చి ఇచ్చేవారు మరికొందరు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి మద్యం బెల్ట్‌షాపులను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లింగసముద్రంలో భూ బకాసురులు

- ప్రభుత్వ భూములు 8వేల ఎకరాలకుపైగానే..
- ఆక్రమణలకు గురైంది 2,500 నుంచి 3వేల ఎకరాలు
- 2012లోనే లెక్కతేల్చిన అధికారులు
- ఆక్రమిత భూముల్లో వాణిజ్య పంటల సాగు
- రూ. కోట్లు ఆర్జిస్తున్న కబ్జాదారులు

లింగసముద్రం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూములను పలువురు దర్జాగా ఆక్రమించి, పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో అనాధీనం, గయాళు, మేత పోరంబోకు, పంచాయతీ గ్రేజింగ్, రోడ్డు పోరంబోకు భూములను ఆక్రమణకు గురయ్యాయి. కొన్నేళ్లనుంచి రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో మండలంలో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.

● నిగ్గు తేల్చినా... చర్యలేవి..?

2012లో ప్రభుత్వ భూములు ఆక్రమణలు ఎక్కువవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. వారి లెక్కల ప్రకారం సుమారు 8వేలకు ఎకరాల పైగానే ప్రభుత్వ భూములున్నాయని, వీటిలో సుమారు 2500ఎకరాల మేర ఆక్రమణలకు గు రైనట్టు నిగ్గుతేల్చారు. ఆ భూముల్లో పలు పంటలు సాగుచేసినట్టు గుర్తించి, ఆక్రమణలను తొలగించేందుకు కబ్జాదారులకు నోటీసులిచ్చారు. తరువాత ఆక్రమణలను పట్టించు కోలేదు. ప్రస్తుతం 3వేల ఎకరాల వరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలకు గురై ఉండొచ్చని భావిస్తున్నారు.

● ఖాళీగా కనిపిస్తే కబ్జానే..

లింగసముద్రం, పెంట్రాల, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, రాళ్లపాడు, పెదపవని, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల్లో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగాయి. ముఖ్యంగా లింగసముద్రంలోని పంచాయతీ గ్రేజింగ్ భూములు మూడు నాలుగు వందల ఎకరాలు ఆక్రమణలు జరిగినట్టుగా భావిస్తున్నారు.అలాగే వెంగళాపురంలోని పంచాయతీలోని 155 ఎకరాల గ్రేజింగ్ భూములను పలువురు ఆక్రమించి, దర్జాగా బోర్లు వేసి పంటలు సాగు చేస్తున్నారు. మరికొందరు తిమ్మారెడ్డిపాలెం, కందుకూరు వారికి పంటల సాగుకు కౌలుకు ఇస్తుండడం గమనార్హం. అలాగే పెంట్రాలలో కూడా ఈ గ్రేజింగ్ భూములలో ఆక్రమణలు ఉన్నాయి.ఇక ఆర్ఆర్ పాలెంలో సర్వే నంబర్లు 242నుంచి 314 వరకు సుమారుగా 250 ఎకరాల ప్రభుత్వ అనాధీనం భూములు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. ఇక ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని పెదపవనిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు 1500 ఎకరాలకుపైగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్ర మించడం, ఆ భూములకు అధికారుల నుంచి ఏదోవిధంగా ఒక ధ్రువపత్రం పుట్టించడం, ఎవరైనా అభ్యంతరం చెబితే కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చు కోవడం జరుగుతోంది.మండలంలో కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరుగుతున్నా, అధికారులు వాటి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. రాళ్లపాడులో కూడా ఇదే పరిస్థితి.అయితే చాలామంది ఈ భూములకు నకిలీ డీకే పట్టాలు, పాసు పుస్తకాలు సృష్టించి బ్యాంకుల్లో రుణాలు పొందినట్టుగా ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆక్ర మణదారుల చెర నుంచి ప్రభుత్వ భూములను విడిపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వెంగళాపురం గ్రేజింగ్ భూముల్లో సాగు చేసిన కంది పైరు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మండలంలోని ప్రభుత్వ భూముల్లో జరిగిన ఆక్రమణను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఆక్రమణలు చేపట్టిన వారిని పిలిపించి భూములు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతం ఈ భూములు పంటలు సాగు చేస్తామని వాటిని దిగుబడులు తీసుకున్న అనంతరం ఖాళీ చేస్తామని వారు సమాధానం ఇచ్చారు. ఈ భూముల్లో బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- సీతామహాలక్ష్మి,
తహసీల్దారు లింగసముద్రం

ధాన్యం కొనుగోళ్లపై పర్యవేక్షణ ఉండాలి

● కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



కావలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యం కొనుగోళ్లు, పొలాలు ల్యాండ్ కన్వర్షన్ విషయంపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గురువారం అసెంబ్లీలో గళం విప్పారు. ధాన్యం కొనుగోలు చేసే విషయంలో కోఆపరేటివ్ సొసైటీలకు అధికారాలు ఇస్తున్నందున రైతులు, సొసైటీల మధ్య సఖ్యత కొరవడిందన్నారు. బస్తాలు సకాలంలో ఇవ్వడం లేదని. ఇచ్చిన మిల్లుల వద్ద తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి తరుగు తీస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తూకాలు చేసిన అనంతరం బి ల్లులు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యతో డబ్బులు ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. కనుక సివిల్‌సప్లయ్ ఉద్యోగులను నేరుగా రైస్ మిల్లుల వద్దకు పంపి అక్కడే తేమశాతం చూ సిబిల్లులు ఇచ్చేట్లు చూడాలని ఎమ్మెల్యే కోరారు.

రెండు చోట్ల ఫీజులు వసూలు సిస్టం సరిచేయాలి

పొలాలు విక్రయాలు జరుపుకునే స మయంలో రెండుచోట్ల ఫీజులు వసూలు చేసే ట్లుగా ఉన్న నిబంధనలను సరిచేయాలని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. కొన్ని పొలాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పిట్ పార్ హౌస్‌సైట్స్ అని ఉండ టంతో వాటి రిజిస్ట్రేషన్ సమయంలో 7.5శాతం అదనంగా ఫీజు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఈ పొలాలను వ్యవసాయేతర భూములకు మార్చుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తులు చేసుకుంటే మరలా అక్కడ కూడా ప్రభుత్వానికి ఫీజులు చెల్లించాల్సి ఉందన్నారు. దీనివలన ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా ఆ పొలాలు కొన్న వ్యక్తులు రెండు చోట్ల ఫీజులు చెల్లించాల్సి రావటంతో నష్టపోతున్నాట్లు చెప్పారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రభుత్వానికి అనేక రకాలుగా టాక్స్‌ల రూ పంలో ఆదాయం చేకూరే అవకాశం ఉన్నా రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించేందుకు పొలాలకు రెండు చోట్ల ఫీజలు వసూలు చేయకుండా సరి చేయాలని రెవెన్యూ మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి అలగాని సత్య ప్రసాద్ రెవెన్యూ రికార్డులో అనేక మార్పులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని ఈ సమస్య త్వరలో పరిష్కారం అవుతుందన్నారు.

భూ అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వహయాంలో కోట్ల విలువైన భూములను కొందరు అధికారులు ఉద్ధేశపూర్వకంగా అన్యాక్రాంతం చేశారని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో భూ సమస్యలపై ప్రస్తావించారు. గత నెల 15న కందుకూరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబునాయుడు దశాబ్దాలుగా రైతులకు పెనుసమస్యగా ఉన్న గర్భకం డ్రిక భూములు 1800ఎకరాలను రైతులకు పట్టాదారు హక్కులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవటంపై కృతజ్ఞతలు తెలిపారు. లింగసముద్రం మండలం పెదపవని సర్వే నెంబరు 439లోని గ్రామకంఠం భూ మిపై తప్పుడు పొజిషన్ సర్టి ఫికెట్లతో రిజిస్ట్రేషన్లు చేసుకు న్నారని చెప్పారు. అది ముస్లిం కమ్యూనిటీకి చెందిన పీర్లచావిడి స్థలమని, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని నాగేశ్వరరావు కోరారు. అలాగే పెదపవనిలో వైసీపీ జడ్పీటీసీ కుటుంబ సభ్యులు 7.89ఎకరాల ఈనాం స్థలంను భూ రికార్డులో ఎక్కించుకున్నారని, తక్షణం వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెం గ్రామకంఠం భూమి ఎం డోమెంటు భూమిగా రికార్డులో నమోదవటంతో రిజిస్ట్రేషన్లు జరగటం లేదన్నారు. దీనిపై రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన వాటిపై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తుందని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

బిట్రగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం- చెంచులక్ష్మీపురం గ్రామాల మధ్య గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటరు బైక్‌పై ఉన్న నాగులవరం చెందిన పసుపులేటి వెంకబాబు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తించి అతన్ని చికిత్సనిమిత్తం 108లో నెల్లూరుకు తరలించారు. కారులో వెళుతున్న ఏబీ.కండ్రికకు చెందిన మోజస్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాకు యూనిక్ నెంబరు రాదా.. సంక్షేమ పథకాలు అందవా ?

- మండలంలో 700మంది డీకేటీ పట్టాలున్న రైతులు
- నెంబరు కేటాయింపునకు ఆన్‌లైన్ తీసుకోదంటున్న అధికారులు

వలటివారిపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. అన్నదాతలకు ఈ సంక్షేమ ఫలాలు అందిం చేందుకు ప్రస్తుతం వివిధ పద్ధతులను అవలంబిస్తున్నాయి. అయితే భవిష్యత్‌లో రైతులకు అందజేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, సబ్సిడీ పరికరాలు, పంటల నష్ట పరిహారం, ఎరువుల రాయితీ, కనీస మద్దతు ధర తదితర పథకాలను ప్రత్యేక కార్డు ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. అందుకోసం అర్హులైన ప్రతి రైతుకూ ఆధార్‌కార్డు తరహాలో వ్యవసాయశాఖ ద్వారా 14అంకెల యూనిక్ ఐడీ కేటాయిస్తుంది. అయితే ఇప్పటివరకు సొంత పట్టాలు భూములున్న రైతుల వివరాలను మాత్రమే నమోదు చేస్తున్నారు. కానీ డీకేటీ పట్టాలున్న రైతుల వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో డీకేటీ పట్టాలు కలిగిన రైతులు తమకు పథకాల నిధులు, పరిహారం అందుతాయో లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొంత పట్టాలకే నమోదు..

మండలంలో 21గ్రామ పంచాయతీల్లో 5,960మంది రైతులున్నారు. వారిలో 4,560మంది రైతులకు యూనిక్ నంబర్ కేటాయింపు నమోదు పూర్తి చేశారు. ఇంకా 7వందల మంది రైతులు వివరాలు నమోదు చేయాల్సి ఉంది. అయితే వీళ్ల కాకుండా 700మంది డీకేటీ పట్టాలున్న రైతులు యూనిక్ నంబర్‌ను నమోదు చేయడం లేదు. వ్యవసాయ అధికారులు గత 20రోజులుగా రైతుసేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేస్తున్నారు. డీకేటీ భూ ములున్న ఏ ఒక్క రైతు వివరాలు కూడ నమోదు చేసేందుకు అనుమతి లేదు. డీకేటీ పట్టాలు కలిగిన రైతులందరూ యూనిక్ ఐడీ కార్డు మాకు ఇవ్వరా? కార్డు ఉన్న వాళ్లకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందిస్తే మా పరిస్థితి ఏమిటని డీకేటీ పట్టాలు కలిగిన రైతులు చర్చించుకుంటు న్నారు.



పోలినేనిచెరువులో భూముల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

డీకేటీ పట్టాలకు అనుమతి ఇవ్వలేదు

సొంత పట్టాదారులకు సంబంధించి యూనిక్ ఐడీ కార్డు నమోదు 90శాతం పూర్తయ్యింది. డీకేటీ రైతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో యూనిక్ నంబరు నమోదు అప్రూవల్ కావడం లేదు. త్వరలోనే అనుమతి వస్తుందని ఉన్నతా ధికారులు చెబుతున్నారు. అనుమతి రాగానే డీకే టీ పట్టాలు కలిగిన రైతులకు కూడా యూనిక్ ఐడీ నమోదు చేస్తాం.

- హేమంత్‌భరత్‌కుమార్,
ఏఓ, వలేటివారిపాలెం

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు..



కందుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 167బీ జాతీయ రహదారిలోని కందుకూరు సీటీఆర్ఐ సమీప బైపాస్ జంక్షన్ వద్ద గురువారం ఎదురుగా వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తూ వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. రోడ్డు మార్జిన్‌లోని బండరాళ్లు అడుకోవడంతో బస్సు పల్టీలు కొట్టకుండా ఆగటంతో పెనుప్రమాదం తప్పింది. కందుకూరు నుంచి ఒంగోలుకు వెళ్తున్న నాన్‌స్టాప్ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి మార్జిన్‌లోకి వెళ్లిపోయ్యింది. రోడ్డుకు దిగువ నేలకు సుమారు 10అడుగుల ఎత్తులో బస్సు అదుపుతప్పటంతో పడిపోతుందని బస్సులోని 45మంది ప్రయాణికులు భయాందోళన చెందారు. మార్జిన్ బలహీనంగా ఉండటంతో బస్సు అదుపు తప్పిందని ఆర్టీసీ డ్రైవర్ మహేష్ తెలిపారు. అయితే జంక్షన్ కావటంతో హైవేలో కలిసే సర్వీస్‌రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు వేసి ఉన్నారని బస్సువేగం తగ్గకుండా స్పీడ్‌బ్రేకర్లను తప్పించి అదేవేగంతో వెళ్లిపోయేందుకు డ్రైవరు ప్రయత్నించటం వల్లే బస్సు అదుపుతప్పిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అనంతరం మరో బస్సులో ప్రయాణికులను ఒంగోలుకు పంపించారు.

దేవళ్ల మురళీకి ఎమ్మెల్సీ ఇవ్వాలి

కావలి టౌన్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళీకి ఎమ్మెల్సీ ఇవ్వాలని వడ్డెర సంఘం జిల్లా కోఆర్డినేటర్ గుంజి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయం వద్ద సమావేశంలో సత్యనారాయణ, న్యాయవాది ఇర్ల రమణయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కందుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గురువారం స్థానిక ఉప్పుచెరువు కాలనీలోని నిరుపేద వృద్ధురాలికి బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు కొణిజేటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వీస్ సెక్టార్లకు జీఎస్టీ పరిమితిని పెంచాలి

కావలి, మార్చి6(ఆంధ్రజ్యోతి) సర్వీస్ సెక్టార్‌ల కింద వ్యాపారాలు చేసే వారికి జీఎస్టీ పరిమితిని రూ.20లక్షల నుంచి రూ.40లక్షల వరకు పెంచాలని జీఎస్టీ గ్రీవెన్స్ రీడెర్‌సెల్ కమిటీ బోర్డు సభ్యులు, ఫెడరేషన్ ఆఫ్ ఆల్‌ఇండియా వ్యాపార మండలి జాతీయ కార్యదర్శి అమనా వెంకట సుబ్బారావు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. వైజాగ్‌లో గురువారం పెద్ద వ్యాపార వర్గాలు, బడా పారిశ్రామిక వేత్తలు, ఎగుమతుల, దిగుమతుల దారులతో పోస్ట్ బడ్జెట్‌పై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇంట రాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న సుబ్బారావు వ్యాపారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

నాణ్యమైన రక్త పరీక్ష ఫలితాలివ్వండి

● జిల్లా సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు

లింగసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన పరీక్షల ఫలితాలను ఇవ్వాలని జిల్లా సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ల్యాబొరేటరీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రక్త పరీక్షల వివరాలు, ఫలితాలపై ల్యాబ్ టెక్నీషియన్ షేక్ షహనాతో ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారి రమేష్‌తో రక్త పరీక్షల గురించి చర్చించారు. అలాగే ముత్యాలపాడు సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించి ఆరోగ్య కార్యకర్తలకు సూచనలిచ్చా రు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ దెబ్బకు జగన్ మైండ్‌బ్లాక్

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్

కావలి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దెబ్బకు జగన్ మైండ్ బ్లాక్ అయి ఫస్ట్రేషన్‌లో పిచ్చిగా మాట్లాడుతున్నాడని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఎద్దేవా చేశారు. గురువారం స్థానిక జనసేన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14న పిఠాపురంలో జనసేనాని పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరగనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లాలన్నారు. పవన్‌కల్యాణ్ పట్ల జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పవన్‌కల్యాణ్ ప్రజలనుంచి పుట్టిన నాయకుడని, జగన్ తండ్రి వారసత్వంతో వచ్చిన నాయకుడని, జగన్‌కు ఒక ఛాన్స్ అయిపోయిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ మత్సకారుల విభాగం కమిటీని ప్రకటించి అభినందించారు. కార్యక్రమంలో నేతలు, వీర మహిళలు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కలిగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవంను గురువారం (ఏపీ హంస) వింజమూరు తాలూకా కార్యవర్గ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి, జిల్లా ఏపీ హంస అసోసియేట్ ప్రెసిడెంట్ కప్పా నారాయణరాజు, వింజమూరు తాలూకా కార్యవర్గ ప్రెసిడెంట్ ఎస్ చెంచురామయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.సాయిలక్ష్మీ, సెక్రటరీ సక్కుబాయమ్మ, ట్రెజరర్ దొరసానమ్మ, ఎస్ తిరుపతిరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి

కావలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మన్నంగిదిన్నెలోని బెల్టుదుకాణంపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం అమ్మకాలు చేస్తున్న రావినూతల సాయిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 11మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

న్యూస్ బాక్స్

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళలకు ఉచిత కుట్టుశిక్షణతో పాటు కుట్టుమిషన్లు ఇవ్వనున్నట్లు ఆసక్తి ఉన్న బీసీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ కె.అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్రార్

లింగసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని పాలంకి లిఖిత, 8వ తరగతి విద్యార్థి పైడాల నవలోకేష్‌లు రూపొందించిన సైన్సు ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ మనక్ జిల్లాస్థాయి కార్యక్రమంలో ఎంపికయ్యారు. గురువారం మోడల్‌స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్రార్ విద్యార్థులు, గైడ్ టీచర్లుగా వ్యవహరించిన ఎన్ అన్నపూర్ణ, ఎం.కళ్యాణిలను అభినందించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

వలేటివారిపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత తెలిపారు. మండలంలోని నూకవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వార్షికోత్సవ కార్యక్రమంలో సునీత మాట్లాడారు. మహిళల హక్కులు, సమానత్వం సాధికారిత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్త ధనలక్ష్మీ పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన

కొండాపురం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులపై ఎస్ఐ ఎమ్.వెంకటరావు గురువారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికలకు అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో విధి విధానాలు, పోలీసుల విధులు అంశాలపై కూలంకషంగా వివరించారు. మహిళాదినోత్సవాల్లో భాగంగా బాలికలు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలను అధిరో హించాలన్నారు. చట్టాలపై అవగాహన పెం పొందించుకొని ఆకతాయిలు ఇబ్బందులు పెడితే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్లు ప్రతాప్, క్రిష్ణలు పాల్గొన్నారు.

సీడీపీవో విచారణ



మన్నంవారిపల్లెలో విచారిస్తున్న సీడీపీవో తదితరులు

కొండాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుఎర్రబల్లి పంచాయతీ మన్నంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సీడీపీవో పద్మావతి విచారణ చేపట్టారు. గర్భవతులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులు సక్రమంగా అందడం లేదని గ్రా మానికి చెందిన కొందరు చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఫిర్యాదుదారులతో సీడీపీవో రాతపూ ర్వకంగా వివరాలు అందుకున్నారు. దీనిపై పూర్తివిచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

మైక్‌సెట్ వితరణ



కలిగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కుమ్మరకొండూరు జడ్పీ హైస్కూల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులు సరస్వతీదేవి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ పాల్గొని రూ.7 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను వితరణగా అందజేశారు. అనంతరం హిందీ పండిట్ సోమిశెట్టి మాధవీలత మాట్లాడారు. పది పరీక్షలో హిందీ సబ్జెక్టులో 90పైన మార్కులు తెచ్చుకునే ప్రతి విద్యార్థికి ఒక్కొక్కరికి రూ.1500లు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు విద్య అవసరం

బిట్రగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మహిళలకు విద్య ఎంతో అవసరమని కావలి ఐసీడీఎస్ ఏసీడీపీవో శారద అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో పాల్గొని నిరక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

9గంటల ఉచిత విద్యుత్‌కు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు

● శ్రీనివాసులు, మండల విద్యుత్ శాఖ ఏఈ



ఉలవపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు పగటి పూట ఏకధాటిగా 9గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు గ్రామాలతో సంబంధం లేకుండా ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటుకు కూటమి శ్రీకారం చుట్టిందని మండల విద్యుత్‌శాఖ ఏఈ పువ్వాడి శ్రీనివాసులు తెలిపారు.

? నూతనంగా చేపట్టిన విద్యుత్ సంస్కరణలు ఏవి.

! కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు జీవో ఇచ్చింది. వినియోగదారులకు వచ్చిన ఓటీపీతో ఏఈ లాగిన్‌తో రిజిస్ట్రేషన్ చేస్తాం. రిజిస్ట్రేషన్ అయిన గృహాలకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తాం. మండలంలో 3,650మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల్లో 1,450 మందికి రిజిస్ట్రేషన్ పూర్తయింది.

? ఇతర లబ్ధిదారులకు వెసులుబాటు ఉందా?

! సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం బ్యాంక్ రుణాలు సౌకర్యం కల్పించింది. 2కిలో వాట్స్‌కు రూ.1.50 లక్షలు, 3కిలో వాట్స్ విద్యుత్ వినియోగానికి రూ.2.20లక్షలు ఖర్చవుతుంది. బ్యాంకర్లు రూ.1.98లక్షల రుణం మంజూరు చేస్తారు. మిగిలిన మొత్తం వినియోగదారుడు చెల్లించాల్సి వస్తుంది.

? సింగిల్ ఫేస్ సమస్యల గ్రామాల పరిస్థితి ఏంటి ?

! చాకిచర్ల, కే.రాజుపాలెంలో మునుపు సింగిల్ ఫేస్ సమస్యలుండేవి. నూతన ప్రభుత్వం చొరవతో 100 కేవీ ట్రాన్స్‌ఫా ర్మర్స్, చాకిచర్లలో 8, కే.రాజుపాలెంలో 3ఏర్పాటు చేసి త్రీ ఫేస్‌తో విద్యుత్ అందిస్తున్నాం.

? గ్రామాల్లో డ్యామేజ్ విద్యుత్ స్తంభాల పరిస్థితి?

! కరేడు, చాకిచర్ల, చాగొల్లు గ్రామాల్లో డ్యామేజ్ అయిన పోల్స్ స్థానంలో అంచనాల మేరకు భారీగా స్తంభాలను తెప్పించి పనులు మొదలు పెట్టాం. మన్నేటికోటలో రూ.4కోట్లతో నూతన సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించాం.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

లింగసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన పెద పవని-1,2, చినపవని సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ప్రజల అర్జీలను పెండింగ్‌లో ఉంచ వద్దని చెప్పారు. ఉన్నతాధికారులు అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయా లన్నారు. అనంతరం ఆయన పెదపవనిలోని చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో బోరు వేయించారు. త్వరలో మండలంలోని చెత్త సంపద కేంద్రాలకు తడి,పొడి చెత్తను క్లాప్‌మిత్రలతో తరలించి అక్కడ తయారయ్యే వర్మీకంపోస్టు ఎరువును రైతులకు విక్రయిస్తామన్నారు. అన్ని పంచాయతీల్లోని చెత్త తరలింపు రిక్షాలను అందుబాటులోకి తెచ్చి గ్రామాలను చెత్తరహితంగా మార్చుతామన్నారు.

టెక్నోపల్స్ 2కే25 వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఆర్ఎస్ఆర్‌లో టెక్నోపల్స్ 2 కే 25 బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

బిట్రగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టెక్నోపల్స్-2కే 25 బ్రోచర్‌ను ఏవో ఆర్వీ రమణారెడ్డి ఆవిష్క రించారు. సాంకేతిక విద్య ప్రతిభ గుర్తిం చేం దుకు ఈ నెల 22నుంచి ఈ పోటీలను ప్రా రంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీవీ ఎస్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు రా మిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వెబ్ సైట్‌లో చూడవచ్చన్నారు. కార్యక్రమంలో టెక్నోపల్స్ కన్వీనర్ దిలీప్‌కుమార్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం

కొండాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గానుగపెంట గ్రామానికి గురువారం నుంచి సాయంత్రం కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు గ్రామ టీడీపీ యువ నాయకుడు కిలారి నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఉదయం మాత్రమే బస్సు సౌకర్యం ఉండేదని సా యంత్రం వేళ విద్యార్థులు, పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లిన ప్రజలు బస్సు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కావలి డిపో మేనేజరుతో మాట్లాడి కావలి నుండి కొండాపురం వరకు బస్సును నడిపించేందుకు చర్యలు తీసుకోవడం హర్షనీయం అన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

సహకార సంఘాలను పటిష్టపరచాలి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను పటిష్టపరిచి, సభ్యులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత సహకార రంగం ద్వారా ఇప్పటివరకు సాధించిన అభివృద్ధిని జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం విజన్ డాక్యుమెంట్‌లో సూచించిన విధంగా సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కంప్యూటరీకరించిన వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో లావాదేవీలరె ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన అన్నీ పీఏసీఎస్‌ల్లో పెట్రోలు బంకులు, ఎల్పీజీ గ్యాస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

● కరపత్రం ఆవిష్కరణ

సహకార సంస్థలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎలా సహాయపడతాయో తెలియజేసేలా రూపొందించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎన్ డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం డాక్టర్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రారు.. ధాన్యం అమ్మరని కథలు చెప్పొద్దు

● అధికారులపై ఆర్డీవో ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్డీవో పావని

ఉదయగిరి, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు రారని.. ధాన్యం అమ్మరని తనకు కథలు చెప్పొద్దని ఆత్మకూరు ఆర్డీవో పావని సొసైటీ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని గుడినరవ గ్రామ రైతుసేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై చట్టుపక్కల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ రైతు అయినా ధాన్యం కొనుగోలు చేయడంలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోసారి తాను తనిఖీకి వస్తానని, ఆ సమయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా, ధాన్యం కొనుగోళ్లల్లో ప్రగతి కనిపించకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సమీపంలో ఉన్న సచివాలయం, హెల్త్ విలేజ్ క్లినిక్‌లను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మోచీ కులస్థుల కులధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంపై వారితో చర్చించారు. ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత గన్నేపల్లి రెవెన్యూలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, డీటీ జహీర్‌ఖాన్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి, సొసైటీ సీఈవో పోలయ్య, సర్వేయరు శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 28,593 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం మేథమేటిక్స్, బోటనీ, సివిక్స్ ఒకేషనల్ థియరీ పరీక్షలకు 28,593 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 28,376 మంది హాజరు కావాల్సి ఉండగా, 837 మంది గైర్హాజరు కాగా, 27, 539 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1399 మంది హాజరు కావాల్సి ఉండగా, 165 మంది గైర్హాజరు కాగా, 1234 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరుపై ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఏడు, డీవీఈవో ఐదు, డీఈసీ మూడు, ఫ్లైయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్స్ 17 కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)


ఒక గ్రాము ధర	రూ.8267
వెండి కిలో ధర	రూ. 99,300
వెండి ఒక గ్రాము	రూ.102.30

రేపటి నుంచి ప్రజాచైతన్య యాత్రలు : సీపీఎం

నెల్లూరు (వైద్యం) (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శనివారం నుంచి ఈనెల 17 వరకు నగరంలో ప్రజా చైతన్యయాత్రలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం చిన్నచిన్న సమస్యలు కూడా పరి ష్కరించటం లేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ నినాదానికే పరిమితమయిందని, వాటిని అమలు చేయటంలో విఫలం అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో పెన్నా ప్రవహిస్తున్నా మున్సిపల్ కుళాయిలలో తాగేందుకు సురక్షితమైన నీరు రావటం లేదని చెప్పారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, బీపీ నరసింహం, మూలం ప్రసాద్, షేక్ రషీద్ పాల్గొన్నారు.

నిత్యసాధనతోనే పదిలమైన ఫలితం

● ప్రణాళికతోనే పరీక్షల్లో విజయం ● విద్యార్థులకు సబ్జెక్ట్ నిపుణుల సూచనలు



విద్యార్థి దశలో తొలి పబ్లిక్ పరీక్షలు పదోతరగతిలో ప్రారంభం అవుతాయి. విద్యార్థి భవిత కూడా ఈ పరీక్షలపైనే ఆధారపడి ఉంటుంది. పరీక్షల సమయం కూడా ఆసన్నమవుతుండటంతో ఉత్తమ ఫలితాల కోసం నిత్యసాధన చేస్తున్నారు. తొలి పబ్లిక్ పరీక్షలు కావడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవడం సర్వసాధారణం. ఇప్పటివరకు చేసిన సాధన ఒక ఎత్తయితే ఇప్పటి నుంచి చేసే సాధన మరో ఎత్తు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జరిగే టెన్త్ పరీక్షలకు జిల్లాలో 33,434 మంది విద్యార్థులు హాజరవు తున్నారు. ఉన్న తక్కువ సమయంలో పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి. ఏయే టాపిక్‌లకు అధిక ప్రాధాన్యమిస్తే ఎంతమేలు జరుగుతుంది.. ఎలా చదివితే మంచి మార్కులు వస్తాయన్న అంశాలపై సబ్జెక్ట్ నిపుణుల సూచనలు విద్యార్థుల కోసం..

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

మాతృభాషపై శ్రద్ధ వహించాలి



మాతృభాషే కదా అని తెలుగును తేలిగ్గా తీసుకోకూడదు. తెలుగుభాషను శ్రద్ధగా చదివితేనే మంచి మార్కులు సాధించేందుకు వీలవుతుంది. తెలుగు ప్రశ్నపత్రాన్ని స్వల్పమార్పులు చేసినా ప్రణాళికతో చదివితే నూటికి నూరు మార్కులు సాధించవచ్చు. గుండ్రటి లిపి కలిగి భాషాదోషాలు లేకుండా రాయాలి. పద్యభాగము నుంచి కవి పరిచయాలు, గద్యభాగం నుంచి ప్రక్రియలు, ఉపవాచకం నుంచి పాత్రస్వభావం, పద్యభాగంలో పరిచిత పద్యాలు, సృజనాత్మక ప్రశ్నగా లేఖ, కరపత్రము, అభినందనలు, ప్రశ్నావళి, సంభాషణ, పరిచిత పద్యాలు, చందస్సుకు వృత్యపద్యాలు నేర్చుకోవాలి. అలాగే ఉపవాచకంలో రామాయణ ప్రాశస్త్యం, సీతాపహరణ వృత్తాంతం, సీతాన్వేషణ వృత్తాంతం, వాలి-సుగ్రీవుల వైరానికి కారణాలు చదవుకోవాలి. కాండముల నుంచి వాక్యాలు ఇచ్చినపుడు సూక్ష్మాన్ని గ్రహించి ఆయా కాండముల పేర్లు రాయాలి. ఎస్‌సీఈఆర్టీ ఇచ్చిన అభ్యసన సామాగ్రిలోని మాదిరి పేపర్లను బాగా సాధన చేస్తే విజయం మీదే.

- అంబటి శ్రీనివాసులు, దామరమడుగు జడ్పీ పాఠశాల

ఇంగ్లీష్‌పై అవగాహన అవసరం



ఆంగ్ల ప్రశ్నపత్రంలో రీడింగ్ కాంప్రెహెన్షన్, క్రియేటివిటీ రైటింగ్ భాగాల్లో సమాధానాలు రాసేందుకు పాఠ్యాంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. స్టడీస్కిల్స్, జంబుల్ సెన్టెన్సెస్ రాయడంలో అభ్యసనం ఎంతో అవసరం. గ్రామర్ విభాగంలో 18, 19, 20, 24, 25, 26 ప్రశ్నలు, పాఠాల్లోని సమాన అర్థపదాలు, వ్యతిరేకపదాలు చక్కగా నేర్చుకోవాలి. ఇన్ఫర్మేటివ్ ట్రాన్స్‌ఫర్ ప్రశ్నల తయారు చేయడంపై శ్రద్ధ వహిస్తే ఆంగ్లలో మంచి మార్కులు సాధించవచ్చు. క్రియేటివ్ రైటింగ్ కోసం లెటర్‌రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ, ఆటో బయోగ్రఫీ ప్రశ్నలకు సాధన చేయాలి.

- వీఎస్‌కె.శర్మ, దువ్వూరు

హిందీపై నిర్లక్ష్యం వద్దు..



ఏపీ ఎస్‌ఈఆర్టీ, డీసీఈబీ రూపొందించిన పుస్తకాలను ప్రణాళికా బద్ధంగా చదివితే హిందీలో మంచి మార్కులు సాధించవచ్చు. ప్రశ్నల సంఖ్య 1 నుంచి 12వరకు ఉన్న వ్యాకరణ అంశాలను పాఠ్యపుస్తకంలోని ఉదాహరణలతో ప్రాక్టీస్ చేయాలి. అపరిచిత గద్య, పద్య అంశాలను జాగ్రత్తగా చదివి ప్రశ్నల్లోని పదాలను దృష్టిలో ఉంచుకుని పైన పేరాగ్రాఫ్‌లో ఆ పదాలను గుర్తిస్తూ అవగాహనతో జవాబులు రాయాలి. కవి పరిచయాల్లో కబీర్‌దాస్, మీరాబాయి కవి పరిచయాలు నేర్చుకోవాలి. కబీర్ కే దోహేల్‌లోని తొలి నాలుగు దోహేలలో ఒక ప్రశ్న ఖచ్చితంగా ఉంటుంది. అలాగే మనుష్యతా, కరచలే హమ్ ఫిదా, తతారా వామిరో కథ, కార్టూస్, హరిహరి కాక, సపనోంకే సే దిన్ పాఠాలలో నుంచి ప్రశ్నలు వస్తాయి. పద్యభాగ సారాంశంలో మీరాబాయికే పద్, పర్వత్ ప్రదేశమ్ పావస్ సారాంశాలు, గద్యభాగంలో బడేబాయి సాహెబ్, డైరీ కా ఏక్ పన్నా సారాంశాలు, లెటర్స్‌లో చుట్టిపత్ర్, పుస్తక్ విక్రేతా కేనామ్ పత్ర్, పితాకీ నాన్ పత్ర్ వంటికి, నిబంధ్‌లలో దీపావళి, పర్యావరణ ప్రదూషణ్, వృక్ష హమారే సాధీ, స్వచ్ఛభారత్, కంప్యూటర్ అంశాలు కీలకమైనవి. వీటిని ఖచ్చితంగా సాధన చేయాలి.

- ఎన్.సంపత్ కుమార్, ఓట్టూరు జడ్పీ పాఠశాల

బయలాజికల్‌లో భయం విడనాడాలి



బయలాజికల్ సైన్స్‌పై భయం వీడాలి. తరగతిలో ఉపాధ్యాయుడు బోధించే సమయంలో నోట్సులో రాసుకున్న ముఖ్యమైన పాయింట్లను మరోసారి పరిశీలించుకోవాలి. జీవశాస్త్రంలో 50 మార్కులు సాధించాలంటే ప్రయోగాలు, పట్టికలు, బొమ్మలు బాగా చదవాలి. మొదటి మూడు పాఠాలలో ప్రయోగాలు బాగా నేర్చుకోవాలి. ప్రత్యుత్పత్తి పాఠంలో బొమ్మలు, ప్రశ్నలు బాగా ప్రాక్టీస్ చేయాలి. అనువంశకత పాఠంలో అవగాహన ప్రశ్నలు, పట్టికలు ఎంతో ముఖ్యమైనవి. పర్యావరణం పాఠం నుంచి నిత్యజీవిత అన్వయ ప్రశ్నలకు ఎక్కువ అవకాశం ఉంటుంది. అలాగే నినాదాలు, సూచనలు ప్రశ్నలు తయారు చేయడం వంటి అంశాల్లో సులభంగా మార్కులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వీటిని బాగా సాధన చేయాలి.

- ఎం.హరిబాబు, గంగపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల

గణితం.. చాలా సులభం



డైలీ అసైన్‌మెంట్ టెస్ట్(డీఏటీ)ల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం పొందుతారు. గణితంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారు. గణితం మొత్తం మీద పూర్తిగా 7 అధ్యాయాలలో పట్టు సాధించినట్లయితే సుమారు 60 మార్కులు పొందవచ్చు. వాస్తవ సంఖ్యలు, బహుపదులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాలు, అంకగణిత శ్రేణి, నిరూపక రేఖాగణితం, సాంఖ్యకశాస్త్రం, సంభావ్యత వీటిని పూర్తిగా నేర్చుకుని మిగిలిన అధ్యాయాల్లో ముఖ్యమైన ప్రశ్నలకు లెక్కలు నేర్చుకుంటే 80 మార్కుల పైగా సులభంగా సాధించవచ్చు. జవాబు పత్రం రాసే సమయంలో తొలుత ఒక సెక్షన్ ఎంచుకుని ఆ సెక్షన్ లోని వాటికి సమాధానాలు రాసిన తరువాతనే మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఎస్‌ఈఆర్టీ మోడల్ ప్రశ్నాపత్రాలను కూడా పరిశీలించి వాటిని సాధన చేసి ఉత్తమ మార్కులు సాధించండి.

- జీ.శ్రీనివాసరావు, గండవరం జడ్పీ ఉన్నత పాఠశాల

సైన్స్‌తో అప్రమత్తంగా ఉండాలి



భౌతిక, రసాయన శాస్త్రంలో అధిక మార్కులు సాధించాలంటే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఈ ఏడాది నూతనంగా రూపొందించిన పాఠ్యపుస్తకంలో భౌతికశాస్త్రం నుంచి 4, రసాయనశాస్త్రం నుంచి 4 అధ్యాయాలు కలిపి మొత్తం 8 అధ్యాయాలు ఉన్నాయి. ఈ ఏడాది 50 మార్కులకు ఉండే ప్రశ్నపత్రాపిరి 2 గంటల సమయం కేటాయిస్తారు. వీటిలో వ్యాసరూప ప్రశ్నలు, సంక్షిప్త సమాధానాలు, లఘు సమాధానాలు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు వస్తాయి. భాష్పీభవనం, మరుగుటకు భేదాలు, హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, విద్యుత్‌మోటరు, ఏసీ, డీసీ జనరేటర్ పనిచేసే విధానం, క్వాంటం సంఖ్యలు, నూతన ఆవిష్కరణలు సాధన చేయాలి. అలాగే ఆమ్లాలు-క్షారాలు, పరమాను నిర్మాణం, లోహసం గ్రహణ శాస్త్రంపై పట్టు సాధించాలి. ఘన పదార్థపు విశ్లేషణం కనుగొనుట, సాంఖ్యాంతరం, గాజులదిమ్మె, వక్రీభవన గుణకాలు, ఆమ్లాల రసాయన చర్యలు చదవాలి. భవిష్యత్‌లో ఇంజనీరింగ్, మెడిసన్ ఏ విభాగాల్లో ప్రవేశించాలన్నా భౌతికశాస్త్రం ఎంతో కీలకం.

- ఏవీ.సుధాకర్, పొదలకూరు జడ్పీ ఉన్నత పాఠశాల

సోషల్‌ను రెండు పార్ట్‌లుగా చదవాలి



సాంఘిక శాస్త్రాన్ని, జాగ్రఫీ, ఎకనామిక్స్ ఒక పార్ట్‌గా, హిస్టరీ, సివిక్స్ రెండో పార్ట్‌గా విభజించి చదవాలి. భారతదేశం, ప్రపంచ పటాలపై మ్యాప్ పాయింట్లను గుర్తిస్తే మార్కులు సులభంగా సాధించవచ్చు. బార్‌గ్రాఫ్స్, డయాగ్రమ్స్, టైమ్‌లైన్ చార్ట్‌లను సరిగా అర్థం చేసుకుంటే 8 నుంచి 12 మార్కులు పొందవచ్చు. భారతీయ భౌగోళిక స్వరూపాలు, శీతోష్ణస్థితి, గ్లోబలైజేషన్, సమతుల్య అభివృద్ధి చాప్టర్‌ల నుంచి 8 మార్కుల ప్రశ్నలు వస్తుంటాయి. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు దాని ప్రభావం, భారత రాజ్యాంగం, జాతీయోద్యమం, సామాజిక ఉద్యమాలు తదితర అంశాలు ఖచ్చితంగా చదివితే ఉత్తమ మార్కులు సొంతం చేసుకోవచ్చు. విద్యార్థులు సమాధాన పత్రంలో కొట్టివేతలు లేకుండా చేతిరాత స్పష్టంగా ఉండేలా చూసుకుంటే పూర్తిస్థాయి మార్కులు పొందవచ్చు.

- డాక్టర్ ఆరుమూళ్ల మాల్యాద్రి, కేఎస్ఆర్ఎం పాఠశాల

గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

● జిల్లా కన్వీనర్ రమణప్రసాద్



మాట్లాడుతున్న వీవీ రమణప్రసాద్

వెంకటాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాల బాలికల గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ వీవీ రమణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గురు వారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని దొరవారిసత్రం (బాలురు)-80 సీట్లు, కోట (బాలురు)-80, వెంకటగిరి (బాలురు)-40, గొలగమూడి (బాలికలు)-80, గూడూరు (బాలికలు) -40, నార్త్‌ఆములూరు (బాలికలు)-40, మహమ్మదాపురం, వెంకటాచలం (బాలురు)-40, ఆత్మకూరు(బాలికలు)-40 సీట్లు ఉన్నాయని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో 300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

● ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్



వరి ధాన్యంను పరిశీలిస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్

కోవూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే 300 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. స్థానిక పడుగుపాడు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో సమస్యలు లేకుండా జిల్లా అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు త్వరగా నగదు చెల్లిస్తున్నందువల్ల ఈ ఏడాది ఎక్కువగా సేకరించే అవకాశముందని చెప్పారు. గోనె సంచుల సమస్య తలెత్తకుండా జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరు బాగుందని చెప్పారు. వరి ధాన్యం కొనుగోలు సమయంలో తేమ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. పడుగుపాడు సొసైటీలో ధాన్యం కొనుగోలు చేసే సమయంలో తీసుకుంటున్న జాగ్రత్తల్ని సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి ఆయనకు వివరించారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు

నెల్లూరు(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తూరులో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కే.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 80 సీట్లు ఉన్నాయని, ఆర్‌టీఈ యాక్ట్ కింద 20 సీట్లు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు. అర్హులైన విద్యార్థులు kvs online admisation. kvs.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 21 రాత్రి 10 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే పిల్లల వయసు మార్చి 31, 2025 నాటికి ఆరేళ్లు నిండి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు ఇతరులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లపై మంత్రి నాదెండ్ల టెలికాన్ఫరెన్స్

● పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ సౌరభ్‌గౌర్ గురువారం విజయవాడ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం, తేమ శాతాన్ని సాకుగా చెప్పిందన్నారు,కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, వీటిని రైతులు వినియోగించుకునేలా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఇంకా పంట చేతికి రాలేదని చెప్పారు. చివరి ఆయకట్టు వరకు పండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణ చెల్లింపుల గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో 24గంటల్లో తీసుకున్న ధాన్యానికి చెల్లింపులు గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. రైతులకు ఏమాత్రం ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించడానికి అన్ని చర్యలు చేపడతామని ఆయన వివరించారు.



దాహార్తి తీర్చుకునేందుకు వానరం తంటా...

రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. గుక్కెడు నీటి కోసం మూగజీవాలు పడరానిపాట్లు పడుతున్నాయి. గురువారం ఓ వానరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎయిర్ కండీషన్ నుంచి పైపు ద్వారా వచ్చే వృథా నీటిని సేవించి దాహార్తి తీర్చుకోవడం స్థానికుల్ని ఆశ్చర్యపరిచింది.

- ఉదయగిరి(ఆంధ్రజ్యోతి)

విడవలూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, అదిశగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సభల్లో, సమావేశాల్లో తెలిపారు. ఎమ్మెల్యే తీసుకున్న చొరవతో విడవలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



విడవలూరులో రైతు వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న పీఏసీఎస్ అధికారులు, నాయకులు

సంఘం (పీఏసీఎస్) వారు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. స్థానిక టీడీపీ నాయకులు పొన్నలూరు పురంధర్‌రెడ్డి, పీఏసీ ఎస్ సీఈవో దద్దోలు రవి పర్యవేక్షణలో విడవలూరు గ్రామానికి చెందిన రైతు కడివేటి శ్రీనివాసులు రెడ్డి వద్ద 25 పుట్ల ధాన్యాన్ని పుట్టి రూ.19,720 చొప్పున కొనుగో లు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంచి ధర లభించటంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులను ఆకట్టుకున్న 'ఓపెన్ హౌస్'



పోలీసు స్టేషన్‌లో వైర్‌లెస్ సెట్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

పొదలకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ షేక్.హనీఫ్‌లు విద్యార్థులకు పోలీసు విధులు, ఆయుధాలు, మహిళా చట్టాలు, పోలీస్ స్టేషన్ నిర్వహ ణ, నేరాలు నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు, దొంగతనాల్లో శిక్షలు, శాంతిభద్రతలు, పరిరక్ష ణపై అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్ భౌగోళిక మ్యాప్, వైర్లెస్ సెట్, కేసు డైరీలు, తదితర వాటి గురించి వివరించారు. అదేవి ధంగా విద్యార్థుల నడవడిక ఏ విధంగా ఉండాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం ధరాఘాతం..!?

● ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.3వేల తక్కువ ● రోజురోజుకి దిగజారుతున్న వైనం ● ఆందోళనలో రైతులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి6(ఆంధ్రజ్యోతి): ధాన్యం ధరలు రోజు రోజుకి దిగజారుతోన్నాయి. ప్రభుత్వం పుట్టి గ్రేడ్-1 రకం రూ.19,720గా మద్దతు ధర ప్రకటించి ఆ మేరకు కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోంది. అయితే తేమ కచ్చితంగా 17 శాతం ఉండాల్సి రావడంతో చాలామంది రైతులు వరికోత జరిగిన వెంటనే దళారులు, మిల్లర్లకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం ధరలు పతనమవుతోన్నాయి. కల్లాల్లోనే ధాన్యం సేకరిస్తున్న మిల్లర్లు, దళారు వారికి ఇష్టం వచ్చిన ధర నిర్ణయించి రైతుల శ్రమను దోచుకొంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం వరకు ప్రభుత్వ మద్దతు ధరకంటే సుమారు రూ. 2,520 తగ్గించి పుట్టి రూ.17,200 కొనుగోలు చేశారు. బుధవారం నాటికి మిల్లర్లు, దళారులు మిలాఖతయ్యారు. ఒకేసారి రూ. 500 తగ్గించేశారు. వరి కోతలు ముమ్మరమైన నేపథ్యంలో బీపీటీ పుట్టి ధాన్యాన్ని దళారులు రూ.16700కే అడుగుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రేపటి పరిస్థితి ఎలావుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం పుట్టికి 850 కేజీలు కాగా నెమ్ము 17శాతం ఉన్నా మిల్లర్లు తరుగుపేరుతో పుట్టికి 900 కేజీల ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ట్రక్కు షీట్ ఉంటే రైతులకు రూ.19,720 ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుంది. కానీ సకాలంలో ట్రక్కు షీట్ అందడం లేదు. దీంతో మిల్లర్లు తరుగు, నెమ్ము పేరుతో పుట్టికి 50 నుంచి 200 కేజీలు ధాన్యాన్ని మిల్లరు దోచుకొంటు కేవలం రూ.16,700 చెల్లిస్తు న్నారు.



బుచ్చి-జొన్నవాడ మార్గంలోని చెల్లాయపాళెం పడ్డిపాళెం వద్ద ధాన్యాన్ని మిల్లర్లకు విక్రయిస్తున్న ఓ కౌలురైతు

● ట్రక్కుషీట్ ఇచ్చినా తడిసిమోపెడు..

ప్రభుత్వ మద్దతు ధర కోసం ఆశపడి రైతు నానా కష్టాలుపడి మిల్లర్లకు ట్రక్కుషీట్ తెచ్చి ఇచ్చినా తరుగు, నెమ్ము తదితర అభ్యంతరాలుపెట్టి 900 నుంచి 1050 కేజీల దాకా అదనంగా ధాన్యం తీసుకుంటున్నారు. దీనికితోడు ధాన్యం రవాణా చేసేందుకు జీపీఎస్ ఉండే వాహనాలే రవాణా చే యాలనే ఆంక్షలతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. జీపీఎస్ వాహనాలు ఎక్కడుంటాయో తెలుసుకోలేక ఇబ్బందు లు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. మండలంలో వవ్వేరు కోఆపరేటివ్ రూరల్‌బ్యాంకు, బుచ్చి కోఆపరేటివ్ బ్యాంకు, దామరమడుగు సొసైటీల పరిధిలో మొత్తం 12 రెవెన్యూ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో ఆంక్షలు, వసతులులేమితో మండలంలో రోజుకు వందల ఎకరాల్లో వరికోతలు కోస్తున్నా తక్కువ ధరకు ధాన్యాన్ని మిలర్లకు విక్రయించేందుకే రైతులు మొగ్గు చూపక తప్పడంలేదు.

కౌలురైతుకు కష్టమే మిగిలింది

ఈసారి పంటల్లో మంచి దిగుబడిలేదు. మద్దతు ధర లేదు. ఒక్క రోజులో రూ.500 తగ్గించేశారు. చేసేదిలేక రూ.16,700లకే అమ్ముకోవాల్సి వచ్చింది. పెట్టుబడులు విపరీతంగా పెట్టాల్సి వచ్చింది. దీంతో కౌలు రైతుకు కష్టమే మిగిలింది.
- శ్రీనివాసులురెడ్డి, కౌలు రైతు, సాల్మానుపురం

ఒక్కట్రక్కు షీట్ వస్తే ఒట్టు

ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం విక్రయించేందుకు ట్రక్కుషీట్ కోసం బ్యాంకు వద్ద పడిగాపులు కాసినా ఒక్క ట్రక్కుషీట్ రావడంలేదు. అడిగితే ఆన్‌లైన్ సమస్య అంటున్నారు. దీనికితోడు జీపీఎస్ ఆంక్షలు. దీంతో మిల్లర్లు అడిగినకాడికే ఇస్తున్నాం. - చెవిరెడ్డి సుజిత్‌రెడ్డి, రైతు, రేబాల

C.R.I.M.E N.E.W.S

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



మురళీ మృతదేహం

నెల్లూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు, మండలంలోని పొట్టేపాళెంకి చెందిన గొట్టేటి మురళీ (48)కూలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడికి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాగా, వాటిని అధిగమించలేక బుధవారం గ్రామంలోనే ఇంటి వద్ద గడ్డిమందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. గమనించిన స్థానికులు నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. ఆయనకు భార్య పిల్లలున్నారు. అందిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఎంతమేరకు అప్పులు చేసింది తెలియరాలేదు.

రేషన్ దుకాణంపై విజిలెన్స్ దాడులు

● కేసు నమోదు



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సంగం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సంగంలోని ఓ రేషన్ దుకాణంపై విజిలెన్స్ అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ సుభాన్ తన సిబ్బందితో స్థానిక శివాజీ సెంటర్‌లో ఉన్న మూడవ రేషన్ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో రికార్డులను స్వాధీనం చేసుకుని సరుకు నిల్వలను పరిశీలించారు. 50 కేజీల 6 బస్తాల బియ్యం, అరకేజీ చక్కెర ప్యాకెట్లు 43 తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించి 6ఏ కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



కారును ఢీకొన్న మోటర్ బైక్

వెంకటాచలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. వివరాల మేరకు.. ముగ్గురు యువకులు వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు మోటర్ బైక్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. కారు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బుచ్చిలో ఒకరికి...



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలోని జెండాదిబ్బ సెంటర్‌లో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజుపాళెంకు చెందిన శివకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. శివ రాజుపాళెం నుంచి బైక్‌పై దువ్వూరుకు వెళ్తుండగా జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివకు తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నేషనల్‌హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ

● మానవ మృగం అరెస్టు
● అత్యాచారం చేసి ఆపై హత్య..

పొదలకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు హిందూ శ్మశాన వాటికలో మతిస్థిమితం లేని యువకుడు దారుణ హత్యకు సంబంధించిన మిస్టరీ వీడింది. కామంతో బరితెగించిన కామాంధుడుకి ఆడ, మగా అనే తేడా లేకుండా పోయింది. ఓ మతిస్థిమితం లేని యువకుడిపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడి ఆపై హత్య చేశాడు. ఈ ఘటన జరిగిన వారం రోజుల వ్యవధిలోనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. పొదలకూరు హిందూ శ్మశాన వాటికలో ఈనెల 1వ తేదీన మతిస్థిమితం లేని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలో లభించిన ఆధారంతో గురునాథం రమేష్‌ని అదుపులోకి తీసుకుని విచారించారు. మతిస్థిమితం లేని ఈ యువకుడిపై నిందితుడు గురునాథం రమేష్ పలుమార్లు అత్యాచారం చేసినట్లు నిందితుడు అంగీకరించాడని డీఎస్పీ వెల్లడించారు. దీంతో నిందితుడిని అరెస్టు చేశామని, ఇతనికి గతంలో నేర చరిత్ర ఉందని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన పోలీసులకు రివార్డులు ప్రకటించి అభినందించారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.శివరామకృష్ణారెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ హనీఫ్, సిబ్బంది సురేష్, జయరాజ్, షరీఫ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల్లో ఒకరి డీబార్

వెంకటాచలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో ఒకరు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 1242 మంది విద్యార్థులకు 1137 మంది హాజరు కాగా 105 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నెల్లూరులోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 532 మంది గైర్హాజరు

విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో 532 మంది గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలలో 75 మందికి 57 మంది హాజరు కాగా మిగిలిన 18 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8805 మంది విద్యార్థులకు 8291 మంది హాజరు కాగా 514 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సాయి మందిరం వార్షికోత్సవం

పొదలకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మందిరం లో ఉదయాన్నే కాకడ హారతి ఇచ్చారు. కాకుమాని చెంచు నారాయణ, లక్ష్మి దంపతులు ప్రణవ పతాకావిష్కరణ చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులను ఆలయ కమిటీ సన్మానించింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం వరకు పొదలకూరుకు చెందిన శ్రీసాయి కృష్ణ భజన సమాజంచే సాయినామ సంకీర్తన జరిగింది. కడప జిల్లా మైదుకూరుకు చెందిన ప్రసన్న సీతారామ ఈవెంట్స్ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చీమకుర్తి రాజగోపాల్, నాగిశెట్టి దామోదరరావు, పంగులూరు సుబ్బానాయుడు, తరుగు ప్రభాకర్, లక్కాకుల ఆనందరావు, చాగిలేటి శ్రీహరి, కొత్తలూరు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహ శక్తులపై నిఘా

● రంగనాథ్‌గౌడ్, ఎస్ఐ, కోవూరు

కోవూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గంజాయి, నిషేధిత జూదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, దారి దోపిడీలకు పాల్పడే సంఘ విద్రోహ శక్తులపై గట్టి నిఘా ఉంచామని కోవూరు సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) రంగనాథ్‌గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ఆంధ్రజ్యోతికి వెల్లడించారు.



? గ్రామాల్లో జోరుగా సాగుతున్న గంజాయి విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు

! గంజాయి విక్రయ స్థావరాలపై తరచూ దాడులు నిర్వహిస్తున్నాం. కొందరు విక్రయదారులతో పాటు గంజాయికి అలవాటు పడినవారిని కూడా గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నాం. కొందరికి కౌన్సెలింగ్ ఇచ్చాం. దీంతో గంజాయి వినియోగాన్ని గ్రామాల్లో దాదాపు నియంత్రించగలిగాం.

? జోరుగా సాగుతున్న జూదం నివారణకు తీసుకున్న చర్యలు ఏమిటి.

! జూదం నియంత్రణకు నిఘా పెట్టాం. తరచూ అనుమానిత జూదం నిర్వహణ గృహాలపై దాడులు చేస్తున్నాం. జూదం సమాచార మందితే వెంటనే స్పందించి దాడులు చేసి పేకారాయుళ్లను అదుపులోనికి తీసుకుంటున్నాం. మా పరిధిలో ఎక్కడా పేకాటరాయుళ్లు జూదం జోలికి వెళ్లడం లేదు.

? కోవూరు బజారు కూడలిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుక చర్యలు తీసుకున్నారా.

! సాయంత్రం సమయంలో ట్రాఫిక్ స్తంభించకుండా ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో నేను కూడా దగ్గరుండి చర్యలు చేపడుతున్నాను. ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు కూడా ఇందుకు సహకరించాలి.

? నేరాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! గ్రామాల్లో నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కానిస్టేబుళ్లు నిత్యం పర్యవేక్షిస్తుంటారు. నేరాలతో సంబంధమున్న వ్యక్తులకు తరచూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

పదవ తరగతి విద్యార్థులపై శ్రద్ధ పెట్టండి



కోవూరు : తరగతులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో ఎస్వీ నాయక్

కోవూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్వీ నాయక్ కోరారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బ జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాల న్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు క్రమశిక్షణతో చదవాలని, సమయపాలన పాటించాలని చెప్పారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

పరీక్ష కిట్ల పంపిణీ

ఇందుకూరుపేట : మండలంలోని ముదివర్తిపాలెంలో పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు సిహెకొల్లు నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి పాల్గొని కిట్లను అందజేశారు. ఈ సందర్భగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దొడ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్ఫూర్తితో మండలంలో అన్ని పాఠశాలలకు 418 కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాలల్లో 590 పైన మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.25వేలు బహుమతిగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడుర సదానందం, అప్పాని శ్రీనివాసులు, రవి నాయుడు, ఇస్మాయిల్, నాగార్జున పాల్గొన్నారు.



సైదాపురం:విద్యాసామగ్రి అందజేస్తున్న చంద్రశేఖర్

విద్యాసామగ్రి పంపిణీ

సైదాపురం : మండలంలోని సైదాపురం, మర్లపూడి, చాగణం గ్రామాల్లో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు గురువారం గూడూరుకు చెందిన ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వాసుదేవ కుమార్, వివి రమణ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

రాపూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందిచడమే లక్ష్యం అని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సరస్వతి తెలిపారు. గురవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. రోగులకు అందించే చికిత్స విషయంలో పలు సూచనలు చేశారు. ప్రతి నెలా 5వ తేదీన ఈ కమిటీ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు ఎం గురుమూర్తి, గజరా వేణుగోపాల్, భవాని, ఈ ప్రశాంతి, ధనలక్ష్మి, మారుతమ్మ పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కోవూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండబయలు కూడలిలోని సీతా పోలయ్య భవన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజావలి ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల్లోని మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం



పొదలకూరు : జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన నాయకులు

పొదలకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై మాజీ సీఎం జగన్ అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో స్థానిక పంచాయతీ బస్టాండులో నిరసన తెలిపి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం జనసైనికులు దహనం చేశారు. అనంతరం ఖబడ్దార్ జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దాసినేటి అనిల్ కుమార్ మాట్లాడుతూ తమ నాయకుడు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి జాక్‌పాట్ సీఎం జగన్‌కు లేదన్నారు. స్థాయి మరచి విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు విష్ణు, విజయ్, మోహిత్, ప్రసాద్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం జోలికి వస్తే ఊరుకోం

వెంకటాచలం : డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శి కాకి శివకుమార్ హెచ్చరించారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేదే లేదన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు ఆస్తోటి రవికుమార్, చెంచయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ



వెంకటాచలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుం జులూరుపాడులో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆల యంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయంలో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాల తోపాటు హోమాలు, మహాపూ ర్ణాహంతి, కుంభాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహిం చారు. పుంజులూరుపాడుతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఎట్టకేలకు మోక్షం!

● వినియోగంలోకి కృష్ణపట్నం రిలయన్స్ భూములు
● మెగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు
● సోలార్ ప్యానల్ తయారీకి ప్రయత్నాలు
● స్థానికులతో జంగిల్ క్లియరెన్స్

నెల్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు 17 ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. పరిశ్రమలు ఏర్పాటవుతాయని, ఉద్యోగాలు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్న బాధితులకు మంచిరోజులు రానున్నాయి. కృష్ణపట్నంలోని రిలయన్స్ భూములను వినియోగంలోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం కూడా ఈ భూముల్లో వీలైనంత త్వరగా పరిశ్ర మలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుం టోంది. కృష్ణపట్నంలో థర్మల్‌ప్లాంట్ ఏర్పాటు కు 2,600 ఎకరాల భూమిని 2008వ సంవత్సరంలో రిలయన్స్ సంస్థకు అప్పగిం చారు. అప్పట్లో రైతుల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఈ భూములను సేకరించింది. పరిహారం తక్కువైనప్పటికీ ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో రైతాంగం భూములను అప్పగించింది. అయితే ఆ తరువాత థర్మల్‌ప్లాంట్ ఏర్పాటు కాలేదు. సంవత్సరాలు గడిచిపోతున్నా ఆ భూముల్లో ఎటువంటి పరిశ్రమలను రిలయన్స్ సంస్థ నెలకొల్పలేదు. దీంతో భూములు ఇచ్చిన రైతులు అటు వ్యవసాయం లేక ఇటు ఉద్యోగాలు రాక అల్లాడిపోతున్నారు. ఈ భూములను నమ్ముకున్న వేలాదిమంది వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి లేకుండా పోయింది. చాలా కాలం నుంచి స్థానికులు పోరాటాలు చేస్తున్నా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలోనే రిలయన్స్ సంస్థ నుంచి ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం భూములను వెనక్కు తీసుకుంది. ఈ నేపథ్యంలో రిలయన్స్ సంస్థ మళ్లీ గత ప్రభుత్వంతో చర్చించి థర్మల్‌ప్లాంట్ స్థానంలో వేరొక పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పి మళ్లీ భూములను తిరిగి తీసుకుంది. అయినప్పటికీ ఆ భూముల్లో ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కృష్ణపట్నం భూములపై దృష్టి సారించింది. రిలయన్స్ సంస్థతో చర్చలు జరిపింది. ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ క్రమంలో ఇటీవల రిలయన్స్ అధినేతల్లో ఒకరైన అనిల్‌అంబానీ కృష్ణపట్నం లోని భూములను నేరుగా వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న వ్యాపార నేపథ్యంలో అనుకూలమైన పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయించారు. శ్రీసిటీ తరహాలో రిలయన్స్ భూములను ఉపయోగించి పారిశ్రామిక పార్కును నెలకొల్పాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తొలుత రిలయన్స్ సంస్థ 500 ఎకరాల్లో సోలార్ ప్యానల్స్ తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు సిద్ధమైనట్లు పరిశ్రమశాఖల వర్గాలు చెపుతున్నాయి. జూలైలోపు ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత మరికొన్ని సంస్థలు ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రిలయన్స్ సంస్థకు కేటాయించిన భూముల్లో జంగిల్ క్లియరెన్స్ ప్రారంభమైంది. 17 ఏళ్ల నుంచి పిచ్చిమొక్కల తో నిండిపోయిన భూములను ఇప్పుడు శుభ్రం చేస్తున్నారు. ఈ జంగిల్ క్లియరెన్స్ చేసే పనులను కూడా స్థానికులకే అప్పగించారు. ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్ పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



రిలయన్స్ భూముల్లో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు



ఏడాదంతా పూజలు

నెల్లూరు నగర నాయకి రాజరాజేశ్వరి ఆలయంలో గురువారం రాత్రి అమ్మవారికి పుష్పాభిషేకం కనులపండువగా జరిగింది. ఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని 2025 మార్చి 6 నుంచి 2026 మార్చి 5 వరకు భక్తులు అభిషేకాలు, ప్రథమ పూజల్లో తమ గోత్రనామాలతో పూజలు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు రూ.4వేలు చెల్లించాలని తెలిపారు.

బలవుతున్న పసితనం !

- ఎర్రటి ఎండల్లో చిన్నారులను చూపుతూ యాచన
- ఇతర జిల్లాల నుంచి నగరానికి వలసలు
- చూపరులను కన్నీరు పెట్టిస్తున్న వైనం
- నిర్వాహకులపై పలు సెక్షన్‌ల కింద కేసుల నమోదు
- 1098కి కూడా ఫిర్యాదు చేయవచ్చు



వీఆర్‌సీ సెంటర్‌లో భిక్షాటన చేయిస్తున్న తల్లిదండ్రులు, చిన్నారులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు(ఫైల్)

నెల్లూరు(క్రైం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఎన్ని కష్టాలు పడుతున్నా.. వారి పిల్లలను మాత్రం కంటిరెప్పలా కాపాడుకుంటూ వస్తుంటారు. అయితే నగరంలోని కొన్ని ప్రధాన కూడళ్లలో డబ్బు సంపాదనకు పసికందులు, చిన్నారులను ఆధారం చేసుకొని భిక్షాటన చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉంది. గతంలో నగర చుట్టుప్రక్కల నివాసం ఉంటున్న వారు, జిల్లాలోని కొన్ని ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు చిన్నారులతో భిక్షాటన చేయిస్తుండేవారు. వారిని చూసీ కరిగి పోతున్న ప్రజలు మానవత్వం చాటుతూ దానాలు చేస్తున్నారు. ఇది లాభసాటిగా ఉండడంతో వీరి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉంది.

● కన్నీరు తెప్పిస్తున్న యాచన

పుట్టినబిడ్డ ఏడాది పూర్తయ్యే వరకు వైద్యశాలకు తప్ప బయటకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తారు. తప్పని పరిస్థితుల్లో చిన్నారులకు అన్నీ రకాల జాగ్రత్తలు తీసుకొని బయటకు వెళుతుంటారు. అయితే నగరంలోని ఆర్టీసీ బస్టాండు, వీఆర్‌సీ, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండు, ట్రంకురోడ్డు ఇలా ప్రధాన కూడళ్లలో కొంతమంది మహిళలు ఆరోనెల కూడా పూర్తి కాని పురిటి బిడ్డలను సంకల్లో వేసుకొని 'అమ్మా....అయ్యా...బిడ్డకు పాలు కొనిచ్చేందుకు డబ్బులు లేవు.. దానం చేయండి.. బాబూ'.. అంటూ భిక్షాటన చేస్తుంటారు. ఎర్రటిఎండలో ఆ పసికూనలు సొమ్మసిల్లి పడిపోతూ, దుమ్ము, ధూళితో నిండి కన్పిస్తుంటారు. కొందరు పిల్లలు ఆకలికి అమ్మా అమ్మా... అంటూ ఏడుస్తుంటారు. మరి కొందరు ఏడిస్తేనే డబ్బులు దానం చేస్తారని చిన్నారులను గిచ్చి, గిల్లి మరీ ఏడిపిస్తుంటారు. ఆ చిన్నారులను చూస్తున్న వారికి కన్నీరు వస్తుంటాయి. ఏమ్మా బిడ్డను ఎర్రటి ఎండలో తిప్పుతూ భిక్షాటన చేయకపోతే కాళ్లు చేతులు అన్ని బాగున్నాయి కదా పని చేసుకొని ఆ బిడ్డలను చూసుకోవచ్చు కదా..? అని చెబుతుంటారు.

● వరుస దాడులు చేస్తున్నా..

ఇలాంటి భిక్షాటనపై కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు పోలీసులు, జిల్లా బాలల సంరక్షణ అధికారులు సంయుక్తంగా వరుస దాడులు చేస్తున్నారు. చిన్నారుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా వారిలో ఎలాంటి మార్పులేదు. కౌన్సెలింగ్ నిర్వహించిన రెండు రోజుల తర్వాత చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్నారు. రోజుకు ఒక్కో చిన్నారితో రూ.1000 వరకు భిక్షాటనలో వస్తుండటంతో పెట్టుబడి, కష్టం, శ్రమ లేకుండా నగదు సంపాదిస్తున్నారు. గత రెండు నెలల్లోనే పోలీసులు, జిల్లా బాలల సంరక్షణ అధికారులు ఇలాంటి భిక్షాటనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి 21 మంది పిల్లల్ని పట్టుకుని, వారిలో 10 మందిని హోమ్‌లో చేర్పించారు. 11 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు.

రెండేళ్ల జైలు

పసిపిల్లలను ఎత్తుకుని, లేదా వారిని వినియోగించుకుని భిక్షాటన చేస్తే పలు చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయవచ్చు. భిక్షాటన చేపించే తల్లిదండ్రులపై సెక్షన్ 76 జెజె యాక్ట్-2015, ఎంప్లాయ్ చైల్డ్ బెగ్గింగ్ కింద కేసులు నమోదు చేయవచ్చు. భిక్షాటన చేయించే వారికి రూ. లక్ష జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష పడుతుంది. ఎవరైనా చిన్నారులతో భిక్షాటన చేయిస్తుంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ప్రజలు సమాచారం అందిస్తే మేము వచ్చి రక్షిస్తాం.

- జీ సురేష్, డీసీపీవో

ధాన్యం కొనుగోళ్లపై సమావేశం

నెల్లూరు (హరనాథపురం) : ధాన్యం కొనుగోలుపై రైతు నాయకులు గురువారం జేసీ కే. కారిక్‌తో ఆయన ఛాంబ ర్‌లో సమావేశమయ్యారు. నెమ్ము శాతం, తరుగు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసు కోవాలని కోరారు. తెలుగు రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

'దేవళ్లకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళీకి ఎమ్మెల్సీ ఇవ్వాలని పలువురు వడ్డెర సంఘం నాయకులు కోరారు. గురువారం నగరంలోని వడ్డెర సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ కోసం ఎంతో కష్టపడ్డారని, ఆయన కృషిని గుర్తించి ఎమ్మెల్సీ సీటును దేవళ్ల మురళీకే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు బెల్లంకొండ శ్రీనివాస్, గుంజి నరేష్, మల్లె సూర్యనారాయణ, న్యాయవాది ఇర్ల వెంకటరమణయ్య పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న స్వర్ణ వెంకయ్య

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దళితుల సమస్యలను పరిష్కరించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ జిల్లాలో దళితులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. స్పందించిన కలెక్టర్‌సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

లెంట్‌డేస్ ఉపవాసాల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు వచ్చే నెలలో గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగలు నిర్వహించుకునే సందర్భంగా చేపట్టే లెంట్ డేస్(40 రోజులు) ఉపవాస దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ ఉపవాస దీక్షల్లో క్రైస్తవులు అందరితో ప్రేమగా ఉండి, త్యాగం చేసినట్లయితే మరుజన్మలో మంచి జీవితం వస్తుందన్న నమ్మతారు. ప్రతీరోజు ఉదయం సాయంత్రం చర్చికి వెళ్లి ప్రార్థనలు చేస్తారు.

డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రానున్న మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఈనెల 10 నుంచి పొందవచ్చన్నారు. టీఈటీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) కేటగిరిలకు చెందినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ సొంత జిల్లాలోనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కుల,ఆదాయ, నేటివిటీ ధ్రువీకరణ పత్రులు, టీఈటీ అర్హత సాధించిన రుజువు, ఇతర అవసరమైన సర్టిఫికెట్లతో సంబంధిత డీబీసీడబ్ల్యూ ఈవోకి దరఖాస్తు సమర్పించాలన్నారు.

అనుకోకుండా
అందాల పోటీలోకి..!

● మిస్ నెల్లూరు విజేత హనీప్రియ

ఫ్యాషన్ షోలు, అందాల పోటీల్లో పాల్గొనాలనే ఆలోచన నాలో లేదు. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సింహపురి సుందరిగా నిలిచానన్నారు హనీప్రియ. నెల్లూరులో బ్లాసం బ్లూ ఈవెంట్స్ సంస్థ నిర్వహించిన మిస్ నెల్లూరు - 2025 టైటిల్ సాధించిన ఆమె ఆంధ్రజ్యోతి ముచ్చటించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి...

? : మీ కుటుంబ నేపథ్యం ఏమిటి.

! : మాది నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్. మా తల్లిదండ్రులు వస్నెంరెడ్డి శ్రీదేవి, ఆంజనే యులు బాబు. మా నాన్న ఫైనాన్స్ వ్యాపారం చేస్తారు. మేము ఇద్దరం ఆడపిల్లలం, మా అక్క హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.

? : ఎంత వరకు చదువుకున్నారు.

! : నేను మొదటి నుంచి చదువులో రాణించేదాన్ని. 10వ తరగతిలో 9.5 జీపీఏ, ఇంటర్‌లో 96 శాతం మార్కులు సాధించా. తిరుపతి విద్యానికేతన్ లో బీటెక్ చదివాను. ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నా.

? : మీ హాబీలు ఏమిటి.



! : చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం, పెయింటింగ్ అలవాటు. పాఠశాల, కళాశాల ఫంక్షన్స్‌లో పాటలు పాడి, వెస్టన్ డాన్సులు వేసేదాన్ని. ఫ్రెండ్స్‌తో కలిసి టై పాక్సర్ ప్రొడక్షన్ పేరుతో డిటెక్టివ్ షార్టు ఫిల్మ్ తీశాను. అందులో టైటిల్ పాత్ర పోషించాను.

? : మిస్ నెల్లూరుగా ఎన్నికవడం ఎలా ఉంది.

! : మిస్ నెల్లూరు-2025 ఆడిషన్స్‌కి ఎంపికయ్యాక టైటిల్ సాధించాలంటే ఎలా అనే ఆందోళన ఉండేది. భయాన్ని పోగొట్టేందుకు నా స్నేహితులు ఫ్యాషన్ షో రీల్‌ను పంపించారు. దానిని చూసిన తర్వాత బాగా ప్రాక్టీసు చేశాను. టైటిల్ రాకపోయినా బెస్ట్ ఆఫ్ త్రీలో ఉంటాననే నమ్మకం ఉండేది. ఊహించని విధంగా మిస్ నెల్లూరు కిరీటం దక్కింది. చాలా ఆనందంగా ఉంది. ఇందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

?. మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి

! : ఉద్యోగం ప్రథమం. మా స్పాన్సర్లు ముందుకొస్తే యాడ్స్ చేస్తా. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు సాయం చేయాలన్నదే ఆశయం.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

ఘనంగా
నాగేంద్ర సరస్వతీ ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొగతోట ఆది శంకర ధ్యాన మందిరంలో గురువారం శ్రీలక్ష్మీ నృసింహానంద నాగేంద్ర సరస్వతీ ఆరాధన భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, పుష్పార్చనలు జరిగాయి. సాయంత్రం గాడేపల్లి ప్రశాంత శర్మ, అమ్మతత్వం-ఆవశ్యకత అనే అంశంపై ప్రవచనం చేశారు. ఆధ్యాత్మిక ధ్యాన మందిరం మేనేజర్ సమయానంద నాగేంద్ర సరస్వతీ చరిత్రను వివరించారు. అనంతరం ప్రవచకులు గాడేపల్లి ప్రశాంతశర్మను సత్కరించారు. కార్యక్రమంలో సురవరాజు రాధాకృష్ణ శర్మ, ముల్లమూర్తి ఉదయకుమార్‌శర్మ, గన్నవరం ప్రభాకర్‌శర్మ, మల్లవరపు నరసింహారావు, రాధాలక్ష్మీ, నాగరత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

'పవన్‌ను విమర్శించే స్థాయి జగన్‌కు లేదు'

నెల్లూరు (సాంస్కృతికం) : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి లేదని జనసేన సీనియర్ నాయకులు పీ.టోనీ బాబు తెలిపారు. గురువారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనకు పనికిరావని జగన్మోహన్‌రెడ్డికి 11 మంది ఎమ్మెల్యేలను ప్రజలు ఇచ్చినా, ఆయనకు ఇంకా సిగ్గురాలేదని దుయ్యబట్టారు. కాగా పిఠాపురంలో జరిగే పార్టీ ప్లీనరీకి రెండువేల మందితో తాను హాజరవుతామన్నారు.

రేపు మహిళా దినోత్సవం

నెల్లూరు(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాలులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.సురేంద్రరెడ్డి, ఎం.పిచ్చిబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయినులంతా హాజరు కావాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈవోడాక్టర్ ఆర్.బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.సుష్మ, సోషల్ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ టీ.పద్మజ పాల్గొంటారని తెలిపారు.

●నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) మహిళా విభాగం, జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ సుజాతాబాయి, కన్వీనర్ సువర్ణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ప్రతి తరగతి గదికి ఓ టీచరు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పాల్గొన్న అధికారులు

- ఇంటరాక్టీవ్ బోర్డుల విజివల్స్ ద్వారా పాఠాలు
- నగర నియోజకవర్గ పాఠశాలల సమీక్షలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మార్చి 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ప్రతి తరగతి గదికి ఒక్కో టీచర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో నగర నియోజకవర్గ పాఠశాలల స్థితిగతులపై అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 పాఠశాలల్లో 304 తరగతి గదులున్నాయన్నారు. ప్రతి తరగతికి ఓ టీచర్ ఉండాలని స్పష్టం చేశారు. గదిలో ఇంటరాక్టీవ్ బోర్డులు ఏర్పాటు చేసి, అందులోని విజివల్స్ ద్వారా సులభతర పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు చెప్పాలన్నారు. ఇందుకుగాను ఉపాధ్యాయులకు ముందుగా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతీ పాఠశాలలో ఆట స్థలాన్ని ఆధునీకరిస్తామని ప్రకటించారు. తన నియోజకవర్గంలో పాఠశాలలు రాష్ట్రంలోనే ఆదర్శవంతగా ఉండాలని చెప్పారు. అనంతరం నేతాజీనగర్, మాగుంట సుబ్బరామిరెడ్డి పార్కులను సందర్శించారు. జిమ్ పరికరాల ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, ఏడీసీ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఓపెన్‌హౌస్ నిర్వహణ

● పోలీసుల విధులను వివరించిన అధికారులు

నెల్లూరు(క్రైం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం విద్యార్థినులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసు కార్యాలయంలోని మెయిన్ గేట్ గార్డు నుంచి ఎస్పీ, ఏఎస్పీ ఛాంబర్లు, అన్ని సెక్షన్‌లు, ఐటీ కోర్, సైబర్ టీమ్, ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల పనితీరు, కమ్యూనికేషన్ సెట్, డయల్ 112, ఎల్‌హెచ్‌ఎంఎస్, డాగ్‌స్వాడ్ బృందాల పనితీరు, ఆయుధాలు ఉంచే గది, అన్నీ విభాగాల పరికరాల పనితీరుపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మాట్లాడుతూ పోలీసులకు ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే ఓపెన్ హౌస్ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ మునిరాజ, మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, ఆర్‌ఐలు హరిబాబు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో నిర్మాణ వ్యర్థాలు వేస్తే చర్యలు



పూడిన డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి 6(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు వ్యర్థాలను మురుగు కాలువల్లో వేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని సిటీప్లానింగ్ అధికారులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. గురువారం నగరంలోని 37వ డివిజన్‌లో ఆయన మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి పర్యటించారు. అక్కడ క్కడ కాలువల్లో నిర్మాణ వ్యర్థాలు వేయడంతో ఇలాంటి వ్యర్థాలు కాలువల్లో ఉంటే ఆయా యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కొత్త, పాత మిలటరీ కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాల్లోని పార్కులను పరిశీలించారు. జిమ్ పరికరాలు, బెంచీలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటాలని ఉద్యాన అధికారికి సూచించారు. రాత్రుళ్లు పార్కుల వద్ద కచ్చితంగా పోలీస్ పెట్రోలింగ్ ఉండేలా చూడాలన్నారు.

'హౌసింగ్'ను ప్రక్షాళన చేయాలి



డీఆర్‌వోకి వినతిపత్రం సమర్పిస్తున్న మిడతల రమేష్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ శాఖలో అవినీతి అధికారుల నిగ్గు తేల్చేందుకు ముందుగా ఎండీ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని బీజేపీ నమామీ గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, కోరారు. గురువారం ఆయన డీఆర్‌వో ఉదయ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు కూడా ఈ అంశమై లేఖ రాశామని తెలిపారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను హౌసింగ్‌శాఖలో యథాతథంగా కొనసాగిస్తూ ఉండడంతో అవినీతి అధికారులకు షోకాజ్ నోటీసులతో సరిపెడుతున్నారన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు ఒకరిద్దరు ఏఈలను సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. హౌసింగ్‌లో గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులను బదిలీ చేయాలని కోరారు.

పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు



విలేకరులతో మాట్లాడుతున్న సుజయ్‌బాబు తదితరులు

నెల్లూరు(క్రైం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి లేదని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని మాగుంటలేవుట్‌లో ఉన్న ఆ పార్టీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని, జగన్ చాలా రోజుల తర్వాత బయటకు వచ్చి నేను బతికే ఉన్నాని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు జగన్‌కు 11 సీట్లు ఇచ్చినా అతడిలో ఇంకా మార్పు రాలేదని, జనసేనపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, నాయకులు శనివారపు అజయ్‌బాబు, వావిళ్ల బాలాజీ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సుధాకర్ ?

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జలదంకి సుధాకర్ పేరును సూచిస్తూ సీఎం చంద్రబాబుకు పలువురు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. నెల్లూరు రూరల్ నుంచి పలువురు ముఖ్య నేతలు ఈ పదవికి పోటీపడ్డారు. పార్టీ కష్టకాలం నుంచి పనిచేసిన సుధాకర్ వైపు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు మొగ్గుచూపారని సమాచారం.

విద్యార్థుల జీవితంలో టెన్త్ ఎంతో కీలకం



మాట్లాడుతున్న ఏజీఎం భాస్కర్‌రెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితంలో పదోతరగతి ఎంతో కీలకమైనదని నారాయణ మెడికల్ కళాశాల ఏజీఎం సీహెచ్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. సెట్నల్, పీఎంపీల సంయుక్త ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని డీఎన్‌ఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం టెన్త్ విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితానికి పునాదులు వేసుకునే అవకాశం పదవ తరగతిలోనే లభిస్తుందన్నారు. టెన్త్‌లో ఉత్తమ మార్కులే అన్నింటికీ ప్రామాణికమని, టెన్త్‌లో ఉత్తమంగా మార్కులు తెచ్చుకునేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఏ.వైష్ణవి మాట్లాడుతూ విద్యార్థులు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సెట్నల్ సీఈవో ఎ.నాగేశ్వరరావు, జిల్లా పీహెచ్‌సీ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, నేతలు దేవరకొండ శ్రీనివాసులు, గోరంట్ల శేషయ్య, పాఠశాల వ్యవస్థాపకుడు దూడల ప్రసాదరావు, హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాతశానంబట్ల వద్ద..



ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేస్తున్నాం. రోజుకు ముగ్గురు వీఆర్వోల చొప్పున.. నిఘా పెట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- గత నెల 6వ తేదీన చంద్రగిరి తహసీల్దారు శివరామసుబ్బయ్య చెప్పిన మాటలివి. క్షేత్రస్థాయికి వచ్చేసరికి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



ఎం.రంగంపేట వద్ద భీమానదిలో

టాస్క్‌ఫోర్సు ఏమైనట్లు?

యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా

ఫిర్యాదులపైనా పట్టించుకోని అధికార యంత్రాంగం

చంద్రగిరి మండలంలోని స్వర్ణముఖినది, భీమానది, దోసుళ్ల వంకలలో యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానంలో.. తమ అవసరాలకు ఎవరైనా ఎక్కడైనా ఇసుక తీసుకోవచ్చు. కాకుంటే మనుషుల ద్వారా తవ్వి పోసుకోవాలన్నది నిబంధన. ఇక్కడా నిబంధనల అమలు కావడంలేదు. ఎటుచూసినా ఎక్స్‌కవేటర్లతో తవ్వడాలే. ప్రధానంగా స్వర్ణముఖి నదిలో నరసింగాపురం వద్ద, రెడ్డివారిపల్లె, చంద్రగిరి-శ్రీనివాసమంగాపురం బ్రిడ్జి వద్ద, చంద్రగిరి బ్రహ్మంగారిగుడి, కేశవరెడ్డి స్కూల్ వద్ద, పాతశానంబట్ల, దోర్నంకబాల వద్ద దోసుళ్ల వంక, తొండవాడ ఎన్టీఆర్ కాలనీ వద్ద, భీమానదిలో ఎ.రంగంపేట, భీమవరం, నారావారిపల్లె తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. దీనిపై సమాచారం ఇస్తే చేస్తే 'వెంటనే దాడులు చేస్తాం' అనే సమాధానం తప్ప రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ఒక వేళ దాడులు చేస్తే చంద్రగిరిలో పలుకుబడిన ఉన్న నాయకుల ట్రాక్టర్లు, టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను వదిలేసి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలను సీజ్ చేసి చేతులు దులుపుకొంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఎ.రంగంపేట పంచాయతీ దర్శిపల్లి వద్ద గ్రామానికి ఆనుకొనే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, సర్పంచ్ ఎర్రయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎ.రంగంపేట వద్ద భీమానది నుంచి భాకరాపేట, పులిచెర్ల, కొత్తపేటకు ఇసుక టిప్పర్ల ద్వారా తరలిపోతుంది. చంద్రగిరి, పాతశానంబట్లకు చెందిన ఇసుక అక్రమ దారులు టిప్పర్ల ద్వారా భారీగా మామిడి తోటల్లో డంపులు ఏర్పాటు చేసి, తిరుపతికి తరలిస్తున్నారు. ఇక, గంగుడపల్లె, చిన్నరామాపురం వద్ద చెరువులో నుంచి యధేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతుంది. దీనికి డూప్లికట్ బిల్లులు చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, గత ప్రభుత్వంలోనూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారే.. ఇప్పుడూ ఇసుక తవ్వేస్తున్నారన్న విమర్శలున్నాయి.



చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ వద్ద ఇసుక డంపు



చంద్రగిరి బ్రహ్మంగారి గుడి సమీపంలోని స్వర్ణముఖినదిలో..

అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిందెవరు?

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు ఎవరనేది ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహం. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తే.. తమకు సంబంధం లేదంటూ, ఒక్కోసారి తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారని స్థానికులు అంటున్నారు. ఇక, మండలంలో మైనింగ్‌శాఖ అధికారులు దాడులు చేసిన సంఘటనలు లేదు. పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నా, కొన్ని వాహనాలు మాత్రమే పట్టుకుని సీజ్ చేస్తున్నారు.



గంగుడుపల్లె వద్ద గ్రావెల్ తరలింపు

చంద్రకళ

విధి వక్రీకరించినా ఆమెలో ఆత్మవిశ్వాసం సడలలేదు. భర్త నేర్పిన దారు శిల్పకళను బతుకుదారిగా మలచుకుంది. అద్భుత నైపుణ్యంతో రాణిస్తోంది. 35మందికి ఉపాధి చూపుతోంది పుత్తూరుకు చెందిన చంద్రకళ..

- 6లో



అధ్యక్షా..

పాకాలలో భూసార రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి



రాయలసీమలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధికంగా మామిడి దిగుబడి అవుతోంది. ఇక్కడి భూసారానికి.. ఇతర ప్రాంతాల్లోని భూసారం మధ్య చాలా వ్యత్యాసం ఉంది. నూజివీడులో భూసారవంత పరీక్షల సెంటర్ ఉండటం వల్ల అక్కడ మామిడి రైతులు భూసార పరీక్షలు చేసి, అందుకు తగిన ఎరువులు వాడటం వల్ల లాభాలు గడిస్తున్నారు. పాకాల మండలంలో మామిడి పంటకు జోన్‌గా ఉంది. అక్కడ భూసార పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇది రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

జిల్లాకు 39 మంది ప్రొబేషనరీ ఎస్ఐలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా 39 మంది ప్రొబేషనరీ ఎస్ఐలను కేటాయిస్తూ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. వీరు గురువారం ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఎస్పీ హర్షవర్ధనరాజు ఎదుట రిపోర్టు చేశారు. పోలీసు అతిథి గృహంలో వారితో సమావేశమైన ఎస్పీ ప్రతి ఒక్కరూ చట్ట పరిధిలో ఉద్యోగం చేస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. బేసిక్ పోలీసింగ్, టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఓ సురేష్‌బాబు, సీఐ సాధిక్ అలీ పాల్గొన్నారు.

పుత్రశోకం

- 'పుత్తూరు' ప్రమాదంలో గాయపడిన పెద్ద కొడుకూ మృతి
- శోకసంద్రంలో గట్టు గ్రామం



→ మునికుమార్(ఫైల్ ఫొటో)



అంబులెన్సులో మృతదేహం రావడంతో గుమికూడిన గ్రామస్థులు, బంధువులు

పుత్తూరు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్ముడు దుర్మరణం చెందగా.. తీవ్రంగా గాయపడిన అన్న కూడా గురువారం అసువులు బాశారు. ప్రమాదంలో ఇద్దరు కొడుకులనూ పోగొట్టుకున్న తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ కుమారులు మునికుమార్(19), రవిశేఖర్(18) పుత్తూరులో డిగ్రీ చదువుతున్నారు. బుధవారం ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరగా.. పిల్లారిపట్టు సమీపంలో రాంగ్‌రూట్లో వస్తున్న ట్రాక్టరు ఢీకొన్న విషయం తెలిసిందే. రవిశేఖర్(18) ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, తీవ్రగాయాలై మృత్యువుతో పోరాడిన మునికుమార్(19) గురువారం మధ్యాహ్నం అసువులు బాశారు. పిల్లలపై ఎంతో ప్రేమ పెంచుకుని, వారి ఉన్నతి కోసం కలలు కన్న తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చారు. ఇద్దరు కొడుకులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయారు. తాము సర్వం కోల్పోయామని గుండెలవిసేలా రోదించారు. ఒక్క కొడుకు మృతి చెందిన బాధ నుంచి తేరుకునేటప్పకే మరో కొడుకూ మృతి చెందాడన్న వార్త వారిని కుంగదీసింది. ప్రాణాలతో తిరిగి వస్తాడన్న భరోసాతో ఉన్న తల్లిదండ్రులకు మునికుమార్ విగతజీవిగా రావడంతో కన్నీరుమున్నీరయ్యారు. తమ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థుల మృతితో గట్టులో విషాదం నెలకొంది. కాగా, బంధువుల సహకారంతో మునికుమార్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం రూ.12 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలుమార్లు పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, పాతవందన వైన్స్ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా, మునికుమార్ మృతదేహంతో ధర్నా చేసేందుకు సిద్ధపడ్డారు. పోలీసు అధికారులు వాహన వేగం నియంత్రణకు చర్యలు చేపడతామని విన్నవించడంతో ప్రజలు ధర్నా విరమించారు. కాగా, ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల బంధువులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



అంబులెన్సు వద్ద రోదిస్తున్న బంధువులు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

గూడూరు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం తిప్పవరపాడు సమీపంలో ఆటో.. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో దంపతులు మృతిచెందారు. వారి పాప గాయపడ్డారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. సైదాపురం గ్రామానికి చెందిన మునెయ్య (40), జ్యోతి(35) దంపతులు దుస్తుల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గురువారం పాప వైష్ణవితో కలిసి వీరిద్దరూ ద్విచక్ర వాహనంలో గూడూరుకు వచ్చారు. తమ పని చూసుకుని గ్రామానికి వెళుతుండగా, ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో మునెయ్య అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడిన జ్యోతిని చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వీరి పాప వైష్ణవికి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాదంలో భార్యభర్తల మృతితో పాప అనాథగా మారింది. సంఘటనాస్థలాన్ని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





మృతిచెందిన మునెయ్య, జ్యోతి (ఫైల్ ఫొటో)

మిస్సయిన భక్తుడి కోసం..!

- అవ్వాచారి కోన లోయలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

తిరుమల, మార్చి6(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలోని అవ్వాచారి కోన లోయలోకి దూకిన వ్యక్తి కోసం భద్రతా సిబ్బంది గురువారం తనిఖీలను కొనసాగించారు. అక్కగార్ల ఆలయానికి సమీపంలో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి లోయలోకి దూకినట్టు శ్రీహరిబాబు అనే భక్తుడు భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పోలీసులు, విజిలెన్స్, ఫారెస్ట్, ఫైర్ అధికారులు, సిబ్బంది దాదాపు 300 మీటర్లు లోయలోకి దిగి గాలించినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో తిరిగి వచ్చేసిన విషయం తెలిసిందే. తిరుమల నుంచి బయలుదేరి తిరుపతి చేరుకోని వారి గురించి సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు ఓ వ్యక్తిని గుర్తించాడు. భక్తుడు చెప్పిన ఆనవాళ్లు కూడా సరిపోవడంతో ఈ వ్యక్తి ఎక్కడి నుంచి వచ్చాడు, తిరుమలలో ఏం చేశాడనే అంశాలను తెలుసుకునేందుకు రివర్స్ మోడ్‌లో సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించగా ఆ వ్యక్తి తిరుమలలో టీ మాస్టార్‌గా పనిచేస్తున్న వీరప్ప అనే వ్యక్తిని కలిసినట్టు గుర్తించారు. ఈమేరకు వీరప్పను ప్రశ్నించగా అతని పేరు సిద్దారెడ్డిగా తెలిసింది. సిద్దారెడ్డికి చెందిన ఓ కీ ప్యాడ్ ఫోన్, ఓ జత బట్టలను వీరప్ప పోలీసులకు అందజేశాడు. దీంతో పోలీసులు ఆ దుస్తుల ఆధారంగా డ్యాగ్ స్క్వాడ్‌తో గురువారం అవ్వాచారి కోనలోయలో గాలించారు. ఈక్రమంలో పోలీసు డాగ్ కేవలం 30 మీటర్లు మాత్రమే లోపలకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చేసింది. దీంతో రెండో రోజూ ఆ వ్యక్తి గురించి ఎలాంటి ఆధారాలు లభించలేదు.



సిద్దారెడ్డి (ఫైల్.. సీసీ పుటేజీ ఫొటో)

ముక్కంటి ఆలయంలో
శాంతి అభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం శాంతి అభిషేకం నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఉత్సవర్లకు శాంతి అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. ఆలయంలోని అలంకార మండపం వద్ద ఉత్సవర్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో తెలియక పొరపాట్లు జరిగుంటే ప్రాయశ్చిత్తం కలిగేలా ఉత్సవమూర్తులకు హోమం ద్వారా శాంతి పూజలు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అధికారులు, టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, విజయకుమార్ పాల్గొన్నారు.



సీసీ నిఘాలో తిరుపతి!

- తొలిదశలో ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు
- మలి విడతలో నగరమంతటా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది. దశలవారీగా తిరుపతి నగరాన్ని సీసీ కెమెరాల నిఘాలోకి తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసింది. తొలుత ముఖ్యప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు చుట్టుపక్కల, పెద్దకాపులేఅవుట్ ప్రాంతాల్లో దాదాపు 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌లో జేపులు, ఆటోల కట్టడికి, అసాంఘిక శక్తులపై నిఘాకు మరో 10 సీసీ కెమెరాలు అమర్చారు. కర్నాల వీధి నుంచి పూర్ణకుంభం సర్కిల్ వరకు ప్రతి 100 మీటర్లకు ఒక శక్తిమంతమైన కెమెరా, ఎప్పుడూ తిరుగుతూ ఉండేలా ఏర్పాటు చేశారు. మరోవైపు దేశ విదేశాల నుంచి తిరుమలకు కాలినడకన, వాహనాల్లో భక్తులు వెళుతుంటారు. టీటీడీ ఉద్యోగులు, స్థానికులు కొందరు ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులను అలిపిరి వద్ద పార్కింగ్ చేసి కొండకు వెళుతుంటారు. ఇటీవల అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్సు, లింక్ బస్టాండును అడ్డాగా చేసుకుని విచ్చలవిడిగా చోరీలు, పిక్ ప్యాకెట్లు, భక్తులను వివిధ రకాలుగా మోసగించి డబ్బులు లాక్కోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని దృష్టిలో వుంచుకుని ఎస్పీ హర్షవర్ధనరాజు.. తాజాగా భూదేవి కాంప్లెక్సు వద్ద మరో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. తిరుపతిలో ట్రాఫిక్ నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా, రౌడీలు, ఆకతాయిల ఆటకట్టించడం, విద్యార్థినులకు రక్షణ, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి కార్యకలాపాలను అడ్డుకోవడానికి రెండో దశలో అంతటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. అన్ని రోడ్లు, రద్దీ కూడళ్లు, ఫ్లైఓవర్‌పై శక్తిమంతమైన కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. స్మార్ట్ సిటీ నిధుల కింద వీటిని కొనుగోలు చేయనున్నారు. ఇలా ఆయా శాఖల సమన్వయంతో నగరమంతటా సీసీ కెమెరాలను అమర్చనున్నారు. దీంతో ఆధ్యాత్మిక క్షేత్రం పూర్తిగా సీసీ నిఘాలోకి రానుంది.



కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం)	: 6.25
సహరి (శనివారం)	: 5.06

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

సూళ్లూరుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. గురువారం శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల అవగాహన పెంచుకొంటే భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఐటీ ముంబయి ప్రొఫెసర్ సుబ్రమణ్యన్ మాట్లాడుతూ సైన్స్‌లో దేశం సాధించిన విజయాలను క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రదర్శనలను తిలకించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, షార్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సుబ్రమణ్యన్‌కు రాకెట్ నమూన జ్ఞాపికను అందజేస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్ పక్కనే కంట్రోలర్ శ్రీనివాసులరెడ్డి తదితరులు




ఆత్మరక్షణ శిక్షణ అవశ్యం : డీఈవో

● రాణీలక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ప్రారంభం

తిరుపతి(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ అత్యంత అవశ్యమని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించనున్న రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన గురువారం డాక్టర్ ఎస్ఆర్కే మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. బాలికలపై పెరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకుని వారికి భద్రత కల్పించడానికిగాను ప్రభుత్వం పాఠశాలల్లో బాలికలకు పోరాట విద్యల్లో శిక్షణనందిస్తోందని వివరించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ మాట్లాడుతూ ఆత్మరక్షణ శిక్షణ ద్వారా బాలికలు మానసికంగా, మేధోపరంగా, శారీరకంగా దృఢంగా రూపొందుతారని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకోగలుగుతారని చెప్పారు. రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రూపేష్‌బాబు, సీఎంఓ సురేష్, పాఠశాల హెచ్ఎం ఎంపి కృష్ణకుమార్, రూపేష్ సొసైటీ శిక్షకులు పాల్గొన్నారు.

→ మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్, పాల్గొన్న డీవైఈఓ బాలాజీ, సీఎంఓ సురేష్ తదితరులు

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.11 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,285

తలనీలాలు సమర్పించినవారు: 20,829

చంద్రకళ

● దేశ,విదేశాల్లో మెప్పు పొందుతున్న తొర్రూరు కొయ్యబొమ్మలు

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాను. గ్రామీణ కళ నాకు కూడుపెట్టింది. నా ఇద్దరు పిల్లల భవిష్యత్తుకి బాట వేసింది. ఈ సమయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారం మరువలేనిది. ఆడవాళ్లతో పాటూ మగవాళ్లకూ ఉపాధి చూపే స్థాయికి నేను చేరుకున్నాను.

\- చంద్రకళ





సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీకి వెళ్లినపుడు ప్రధాని మోదీ కీ, కేంద్ర మంత్రులకూ ఏపీ హస్తకళాకృతులను కానుకలుగా అందజేస్తుంటారు. అందులో కొయ్యతో చేసిన దేవతామూర్తులు, గోపురాల బొమ్మలు ముఖ్యమైనవి. ఈ అద్భుత కొయ్య కళాఖండాలు తయారవుతున్నది మన పుత్తూరు మండలంలోని తొర్రూరులో అని చాలా మందికి తెలియదు. ఒక మహిళ ఈ దారుశిల్పాల రూపశిల్పి. ఆమె పేరు చంద్రకళ. భర్త మరణం తర్వాత తను బతకడానికి నేర్చుకున్న కళ ఇప్పుడు 35 మందికి బతుకు చూపిస్తోంది. అంతర్జాతీయ ఖ్యాతికి కారణమైంది.

\- పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

కుప్పంలో పుట్టిన చంద్రకళ బీకాం కంప్యూటర్స్ చేశారు. అంతకన్నా పై చదువులకు వెళ్లాలనే ఆశ ఉన్నా పేద కుటుంబానికి సాధ్యం కాలేదు. పెళ్లి చేసేశారు. 1998లో పుత్తూరుకి అత్తగారింటికి చేరిన ఆమె తన భర్త సంప్రదాయ పద్ధతుల్లో చెక్కి చేసే కొయ్యబొమ్మలను దీక్షగా చూసేవారు. ఎంత కష్టపడ్డా ఆదాయం వచ్చేది కాదు. ఇద్దరు కొడుకులు పుట్టారు. కొయ్య బొమ్మలు చెక్కడం తనూ నేర్చుకున్నారు. ఆర్థిక సమస్యల్లోంచి బయటపడడానికి ఒక పొదుపు సంఘంలో ఆమె చేరారు. భర్తను ఒప్పించి 5 వేలు అప్పు తీసుకుని వేప, వెంగ, చీమచింత కొయ్యలు కొని తన ఆలోచనలకు అనుగుణంగా బొమ్మలు చెక్కడం మొదలు పెట్టారు. ఈ కొత్తదనం కొనుగోలుదారులను ఆకర్షించింది. 2017లో భర్త హఠాన్మరణం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. అయితే చేతిలో ఉన్న కళ ఆమెకు దారి చూపింది. బొమ్మల్లో, రంగుల్లో నిరంతరం కొత్తదనం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. చంద్రకళ చెక్కిన బొమ్మలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తనలాంటి మరికొందరు మహిళలను ఆమె పోగేసుకుని కొయ్యబొమ్మల పనిలో భాగం చేసింది. ఎంపీఎస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ పేరుతో ఆమె సంస్థ ఇప్పుడు 35 మందికి ఉపాధి చూపుతోంది. ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు చేస్తోంది. నెలకు లక్షకు పైగా ఆదాయం లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మార్కాపురంలోని ద్వాక్రా బజారులోనూ తొర్రూరు కొయ్యబొమ్మల ప్రదర్శన ఉంటుంది.

ఇదే ప్రత్యేకత:

సింథటిక్, ఎనామిల్‌తో పాటు మల్టీషేడ్ రంగులను వినియోగించడం వల్ల చంద్రకళ బొమ్మల్లో సహజత్వం ఉట్టిపడుతోంది. బొమ్మల తయారీకి మీమ్ వుడ్ , టేక్ వుడ్, కంట్రీవుడ్ లను ఈమె వినియోగిస్తున్నారు. వీటికి వాటర్‌ప్రూఫ్ కోటింగ్ ఉంటుంది..

ఇల్లాలి చదువు ఇంటికే కాదు జగానికే వెలుగు అని తిరుపతి నగరంలోని మూడు విద్యా సంస్థలు నిరూపిస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆనాడే మహిళావిద్య అవసరాన్ని గుర్తించి, వారికోసమే ప్రత్యేకించి ఓ విశ్వవిద్యాలయం తిరుపతిలో ఏర్పాటు చేశారు. అంతకు ఎన్నేళ్ల ముందో టీటీడీ సహకారంతో ఈ నగరంలోనే తొలి మహిళా డిగ్రీ కళాశాల ఏర్పడింది. ఇటీవల ఏర్పడిన మహిళా వైద్యవిద్యాలయం మూడో కిరీటంగా మారింది. మహిళా సాధికారతకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఈ విద్యాసంస్థలు నిలుస్తున్నాయి.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి..తిరుపతి(విద్య)

తిరుపతి సిగలో

మూడు పద్మాలు

తొలి వర్సిటీకి బీజం



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

1983 ఏప్రిల్ 14న తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పడింది. 138 ఎకరాల విస్తీర్ణంలో 9 విభాగాలతో శ్రీకారం చుట్టుకుంది. నాలుగు దశాబ్దాల్లో 50 కోర్సులకు విస్తరించింది. ఆరు వేల మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. . బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ప్రత్యేకతను చాటుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పొందగలిగింది. యూజీసీ నాక్ ఏ-ప్లస్ గ్రేడ్‌ను కూడా సాధించింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఉత్తమ ర్యాంకు సొంతం చేసుకుంది. విదేశీ విద్యార్థులకు సైతం సంగీత విద్యను నేర్పుతోంది. మహిళల్లో సామాజిక చైతన్యానికి జరుగుతున్న కృషిలో పాలుపంచుకుంటోంది వర్సిటీ. పీఎం ఉష పథకం కింద అందిన రూ.100 కోట్ల నిధి వర్సిటీ పురోగతికి దోహదపడింది

తొలి 'పట్టా'భిషేకం



పద్మావతి డిగ్రీ కళాశాల

రాష్ట్రంలో తొలి మహిళా కళాశాలకు తిరుపతి కేంద్రమైంది. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అబ్బాయిల కాలేజీలో అమ్మాయిలను చేర్చుకోరాదంటూ మద్రాసు వర్సిటీ సిండికేట్ తీర్మానించింది. దీంతో మహిళా విద్యకు గండి పడింది. వెంటనే టీటీడీ స్పందించింది. మహిళలకు బాసటగా నిలిచింది. 1952లో వంద ఎకరాల్లో వేంకటేశ్వర స్త్రీల కళాశాలను ఏర్పాటు చేసింది. రెండేళ్లకు ఎస్వీ యూనివర్సిటీ ప్రారంభమైంది. 1956లో పద్మావతీ మహిళా డిగ్రీ కాలేజీగా పేరు మారింది ప్రిన్సిపాల్ రాజేశ్వరిమూర్తి నేతృత్వంలో ఈ కాలేజి అభివృద్ధికి విశేష కృషి జరిగింది. మాజీ రాష్ట్రపతులు నీలం సంజీవరెడ్డి, బాబూ రాజేంద్రప్రసాద్, మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి ప్రముఖులు ఈ కాలేజీని సందర్శించి ముగ్ధులయ్యారు.

● మహిళల ..మెడి'కల' నెరవేరింది

దేశ రాజధాని ఢిల్లీ తర్వాత దక్షిణాదిన తొలి ప్రభుత్వ మహిళా వైద్యకళాశాల తిరుపతిలోనే ఆవిర్భవించింది. 2014లో 50 ఎకరాల్లో స్విమ్స్‌కు అనుబంధంగా పద్మావతి మహిళా వైద్య కళాశాల 150 సీట్లతో ప్రారంభమైంది. తర్వాత బలహీన వర్గాలకోసం 25 సీట్లను కేటాయించింది. యూజీ-నీట్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. 175 సీట్లతో ఆరు బ్యాచ్‌ల వైద్య విద్యార్థులను ఇప్పటివరకూ అందించింది. దాదాపు వెయ్యి మంది మహిళా వైద్యులు తయారై సేవలందిస్తున్నారు. ఈకాలేజ్ టీచింగ్ రీసెర్చ్‌గా ఉపయోగపడుతోంది. ఇక్కడి వైద్యులకు ప్రైవేట్ ప్రాక్టీస్ అవకాశం లేకపోవడంలో నాణ్యమైన బోధన జరుగుతోంది. స్విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల వల్ల అరుదైన ఆపరేషన్లపై శిక్షణకూ అవకాశం కలుగుతోంది.



పద్మావతి మహిళా వైద్య కళాశాల

ఓటేరు చెరువు వేరు... రైతుల భూములు వేరు

● అసత్య ప్రచారాలు మానండి ● మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఓటేరు చెరువుకు, శ్రీకాళహస్తి రైతులకు ఉన్న భూమికీ ఏ సంబంధం లేదని, రెండూ వేరువేరు అని, రైతులు చెరువును ఆక్రమించుకోలేదని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. గురువారం శ్రీకాళహస్తిలో తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటేరు వద్ద రైతులు కొనుగోలు చేసిన భూమిపై ఎలాంటి అసత్య ప్రచారాలు వేయవద్దని కోరారు. తనపై సీపీఎం, సీపీఐ నాయకులు అబాండాలు వేయడం సరికాదంటూ, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను బ్లాక్‌మెయిల్ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబరు 376లో 12.45 ఎకరాలు ఓటేరు చెరువు అని, సర్వే నెంబరు 370లో 6.70ఎకరాలు కాలువ ఉందని, సర్వే నెంబరు 377లో 17.18ఎకరాలు రైతుల భూమి ఉందని ఆయన వివరించారు. 1906లో బ్రిటీష్‌వారు తయారు చేసిన ఎ రిజిస్టర్, రిజిస్ట్రీ ఆఫ్ హోల్డింగ్‌లో ఇది పుంజు భూమిగా నమోదు అయిందని తెలిపారు. 1906నాటి రికార్డును ఎవరు తారుమారు చేయలేరని స్పష్టం చేశారు. కేసులన్నీ రైతులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయని చెప్పారు. రైతుల భూముల్లోనే జాతీయ రహదారి నిర్మాణం జరిగిందని చెబుతూ, 'చెరువు భూమి అయితే నేషనల్ హైవే వారు చెరువులో రోడ్డు వేస్తారా?' అని ప్రశ్నించారు. సీపీఎం, సీపీఐ నాయకుల వెనుక ఉండి దుష్ప్రచారం చేయిస్తున్న వారు వాస్తవాలు గ్రహించాలన్నారు.

అది ప్రభుత్వ భూమి కాదు

● శ్రీకాళహస్తి రైతుల వివరణ

తిరుపతి, మార్చి6(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామంలోని సర్వే నెం:377లో 17.18 ఎకరాల భూమి ప్రభుత్వానిది కాదని, సర్వే నెంబరు 376లోని 12.40 ఎకరాలు మాత్రమే ఓటేరు చెరువుకు సంబంధించిన స్థలమని శ్రీకాళహస్తికి చెందిన రైతులు తెలిపారు. ఓటేరు చెరువు అన్యాక్రాంతమవుతోందన్న వివాదం నేపథ్యంలో 'ఓటేరు చెరువు చదరం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రైతులు ప్రభుత్వ రికార్డులతో పాటు వివరణ ఇచ్చారు. జాయింట్ పట్టా భూమిని విక్రయ పత్రాల రిజిస్టరు డాక్యుమెంటు ప్రకారం సబ్ డివిజన్ చేసి అడంగల్‌లో నమోదుచేయాలని తాము కోరడంతో, సీఎం రైతుల సమస్యలను పరిష్కరించాలని గత ఏడాది సెప్టెంబరు 24న కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే తమ భూమిని కొందరు చెరువుగా భావిస్తున్నారని, సర్వే నెంబరు 376లో 6.7ఎకరాల చెరువు, కసింకాలువను కొందరు ఆక్రమించారంటూ ఒక్క సెంటు భూమి కూడా తాము ఆక్రమించలేదని పేర్కొన్నారు.

రేపటి నుంచి తుడా టవర్స్ వేలం



తుడా టవర్స్‌ను పరిశీలిస్తున్న వీసీ మౌర్య

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అన్నమయ్య సర్కిల్ వద్ద నిర్మిస్తున్న 'తుడా టవర్స్'కు శనివారం నుంచి వేలం నిర్వహించనున్నట్లు వీసీ ఎన్.మౌర్య తెలిపారు. గురువారం నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ను ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వేలం నిర్వహణపై తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 13 అంతస్థులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రౌండ్, ఒకటో అంతస్థులో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో కార్యాలయాలకు, మిగిలిన అంతస్థుల్లో నివాస యోగ్యంగా 2, 3, 4 బెడ్ రూమ్ ఫ్లాట్లు నిర్మిస్తున్నామని వివరించారు. శనివారం నుంచి 12వ తేదీ వరకు వివిధ అంతస్తులకు వేలం నిర్వహిస్తామన్నారు. తుడా టవర్స్‌లో మోడల్ ఫ్లాట్, గ్యాలరీ ఏర్పాటు చేశామని, ఆసక్తిగలవారు చూడొచ్చన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, తదితరులు ఉన్నారు.

● 'కల్తీ నెయ్యి' కేసు నిందితులకు

ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు నిందితులకు మూడు రోజుల సిట్ కస్టడీ ముగిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసులో ఏ3 నిందితుడు పొమిల్ జైన్, ఏ5 అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను మంగళవారం సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్నారు. సిట్ కార్యాలయంలో విశాఖ సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలో అధికారులు వివిధ కోణాల్లో విచారించారు. వారిద్దరి వాంగ్మూలాలను రికార్డు చేశారు. మూడు రోజుల కస్టడీ గడువు ముగియడంతో గురువారం సాయంత్రం బందోబస్తు మధ్య ఆ ఇద్దరిని జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించారు. మరోవైపు ఏ2 నుంచి ఏ5 వరకు బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న విచారణ జరగనుంది.

టీటీడీ చైర్మన్ పీఆర్వోనంటూ భక్తులను మోసగించిన వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి6(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, తాను పీఆర్వోనని భక్తులు నమ్మించి మోసం చేస్తున్న వ్యక్తిని గురువారం తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. చంద్రగిరికి చెందిన ఫరూక్ అలియాస్ ప్రసాద్ ప్రస్తుతం నెల్లూరు జిల్లా కోవూరులో నివాసం ఉంటున్నాడు. నాలుగు నెలల నుంచి 'తిరుమల సమాచారం' అనే వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి దాదాపు 600 మంది భక్తులను అందులో చేర్చాడు. తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు కావాలంటే తనను సంప్రదించాలని ఆగ్రూపుల్లో పోస్టులు పెట్టేవాడు. తాను టీటీడీ చైర్మన్ పీఆర్వో అని నమ్మించి తిరుమల దర్శన టికెట్ల సమాచారాన్ని గ్రూపుల్లో షేర్ చేసేవాడు. భక్తులు ఎవరైనా వ్యక్తిగతంగా కాల్ చేసి మాట్లాడితే ఆన్‌లైన్ ద్వారా నగదు తీసుకుని ఆ తర్వాత ఆ భక్తులకు ఎలాంటి సమాధానమిచ్చేవాడు కాదు. ఇలా దాదాపు రూ.80 వేల వరకు భక్తుల నుంచి వసూలు చేసి మోసగించాడు. భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో ఫరూక్‌ను అరెస్ట్ చేసి విచారించగా ఆరు సిమ్‌లు, రెండు బ్యాంక్ ఖాతాలతో భక్తులను మోసం చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఫరూక్‌ను అరెస్ట్ చేసి ఓ సెల్‌ఫోన్, సిమ్‌కార్డులు, బ్యాంక్ పుస్తకాలు స్వాధీనం చేసుకుని.. అతడిని రిమాండుకు పంపారు.


గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి అరెస్టు

● ఐదు కిలోల గంజాయి సీజ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని తిరుపతి ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ వివరాల మేరకు.. తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన కురబ అరవింద కొంతకాలంగా విశాఖ, అరకు, తణుకు ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం చిత్రకొండకు చెందిన గణేష్ నుంచి రూ.లక్ష విలువైన గంజాయి కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో తిరుపతికి తీసుకొస్తుండగా ముందుగా అందిన సమాచారం మేరకు తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మహేష్ బాబు బస్టాండులో కాపుకాచి పట్టుకున్నారు. అతని నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరవిందను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు గణేష్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

రథోత్సవంలో రెచ్చిపోయిన 'కేడీ సిస్టర్స్'

● రద్దీలో చేతివాటం ప్రదర్శన
● ఏడుగురు మహిళల నుంచి ఏడు బంగారు గొలుసుల చోరీ
● ఇద్దరు తమిళనాడు మహిళల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపుతున్న పోలీసు అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన రథోత్సవంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లు చేతివాటం చూపారు. ఏడుగురు మహిళల నుంచి బంగారు గొలుసులు అపహరించారు. వీరిని గురువారం అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం మధురై ప్రాంతానికిచెందిన మీనా అలియాస్ లక్ష్మి(29), తిరుచ్చి ప్రాంతానికిచెందిన పొన్నుమని(34) అక్కా చెల్లెళ్లు. వీరిద్దరూ తమిళనాడులోని పలు రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడేవారు. మీనాపై తమిళనాడులో ఆరు చోరీకేసులు నమోదయ్యాయి. ఇటీవల ఓ కేసులో రిమాండు నుంచి బయటకు వచ్చింది. తమిళనాడులోని సంతలో చోరీ చేస్తూ పొన్నుమని పోలీసులకు పట్టుబడి అరెస్టయింది. ఈమె కూడా 20రోజుల కిందట బెయిల్‌పై విడుదలైంది. వీరిద్దరూ కలిసి గత నెల 27వ తేదీన శ్రీకాళహస్తిలో జరిగిన రథోత్సవానికి వచ్చారు. జనాలు అత్యధికంగా ఉండే చోట్ల ఏడుగురు మహిళల నుంచి సుమారు105గ్రాముల బంగారు చైన్లను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ సాగించారు. వారం రోజుల వ్యవధిలోనే తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బంగారు గొలుసులను రికవరీ చేశారు. ఆ ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. వన్‌టౌన్ సీఐ గోపి, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించి రివార్డును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సీఐలు తిమ్మయ్య, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో జనసేన పార్టీ నాయకులు

గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు మునిగిరీష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రోటరీ భవన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి చలో పిఠాపురం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుకు ఎమ్మెల్సీ ఇవ్వడం కార్యకర్తల్లో ఆనందాన్ని పెంపొందించిందన్నారు. ఆవిర్భావదినోత్సవానికి నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్ధన్, నయాం, వెంకటేశ్వర్లు, చంద్ర, అవినాష్, కార్తీక్, శివ, రవి, పవన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మహా సదస్సును విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 10వ తేదీన జరగనున్న బీఎస్పీ కార్యకర్తల మహా సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకుడు నాశిన భాస్కర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోస్టాఫీసు వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతి కోసం బీఎస్పీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు రాజు, ఎల్వీసుబ్బయ్య, లక్ష్మయ్య, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని పలు కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపతయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

చిల్లకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై -బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా రైతులకు నష్టపరిహారం అందించేందుకు గ్రామసభలో ప్రచురించిన రైతుల పేర్లు, భూమి విస్తీర్ణానికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా కోరారు. గురువారం మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ ప్రాజెక్టులో భాగమైన ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందన్నారు. అందుకోసం తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో ఉన్న 617.67 ఎకరాల ప్రభుత్వ భూములలో సర్వే నిర్వహించి తమ్మినపట్నం, తీగపాళెం తదితర గ్రామాల్లోని 385 మంది రైతుల పేర్లను, భూమి విస్తీర్ణం వివరాలను గ్రామసభలో ప్రచురించామన్నారు. అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఏడు రోజుల్లోగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది,

ఏరియా ఆస్పత్రి పరిధిలోకి సబ్‌సెంటర్లను చేర్చాలి



గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పీహెచ్‌సీలోని కొన్ని సబ్‌సెంటర్లను ఏరియా ఆస్పత్రి పరిధిలోకి చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. చెన్నూరు పీహెచ్‌సీ పరిధిలో 13 ఏఎన్‌ఎం సబ్‌సెంటర్లు ఉన్నాయన్నారు. కొన్ని సబ్ సెంటర్‌లను ఏరియా ఆస్పత్రి పరిధిలోకి మార్చితే ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుందని తెలియజేశారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చిల్లకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరం, ఏరూరు గ్రామాలలో గురువారం స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు చింతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పాల్‌జాన్సన్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుమ, చైతన్యభాను, హరిత, పంచాయతీ కార్యదర్శులు పద్మజ, సుభాషిణి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాటరీ టికెట్ల విక్రేతల అరెస్టు

నాయుడుపేటటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గరిడివీధిలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.. రెండురోజుల ముందుకు ఓజిలి మండలం కురుగొండ సబ్‌స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సూసైడ్ నోటులో లాటరీ టికెట్లు కొని అప్పులపాలైనట్లు రాశాడు. ఈ క్రమంలో లాటరీ టికెట్ల విక్రేతలపై దాడులు చేశారు. పట్టణానికి చెందిన మనోహర్, సుబ్రమణ్యం, మండలంలోని వేమగుంట పాళెంకు చెందిన బాలాజీ లాటరీ టికెట్లు విక్రయిస్తుండగా అరెస్టు చేశారు.

బీసీ సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ఓజిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ సబ్సిడీ రుణాల కోసం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఓజిలి, ఆరిమేనిపాడు యూనియన్ బ్యాంక్‌శాఖ మేనేజర్లు కృష్ణకాంత్, సుధాకర్, కురుగొండ ఆంధ్రప్రగతి బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 26 పంచాయతీ పరిధిలో బీసీ సబ్సిడీ రుణాల కోసం 271 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఓజిలి యూనియన్ బ్యాంక్‌కు 19, ఆరిమేనిపాడు బ్యాంకు 17, కురుగొండ్ల ఏపీజీబీకు 16 యూనిట్ల వంతున రుణాల అందించనున్నాయి.

ఇంటి పన్నులపై స్పెషల్ డ్రైవ్



ర్యాలీ చేస్తున్న డీఎల్‌పీవో, పంచాయతీ సిబ్బంది

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెందోడులో గురువారం డీఎల్‌పీవో వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్, అవగాహన ర్యాలీ జరిగింది. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలంటూ నినాదాలు చేశారు. డీఎల్‌పీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఎస్ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది చెందోడు, విద్యానగర్‌లలో ఇంటింటా తిరిగి ఇంటి పన్నులపై అవగాహన కల్పించి వసూళ్లు చేశారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు.

కాళంగి గ్రాయిన్ నిర్మించాలి

శాసన సభలో ఎమ్మెల్యే విజయశ్రీ వినతి



సూళ్లూరుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళంగి నది పులికాట్‌లో కలిసే ప్రదేశంలో గ్రాయిన్ నిర్మించాలని సూళ్లూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. గురువారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ కాళంగినది తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో 75 కిలో మీటర్ల ప్రవహిస్తూ పులికాట్‌లో కలిసి తర్వాత సముద్రంలో కలుస్తుందన్నారు. నీళ్లలేని సమయంలో పులికాట్ సరస్సులోని ఉప్పునీరు నదిలోకి చేరుతాయన్నారు. ఆ నీటితో సమీప భూగర్భజలాలు ఉప్పునీటిగా మారిపోతున్నాయన్నారు. సుమారు 35 వేల మందికి పైగా సాగు, తాగునీటికి ఇబ్బంది అవుతుందన్నారు. 50 ఏళ్లక్రితం ఇక్కడ గ్రాయిన్ నిర్మించారని 2015లో వచ్చిన భారీ వరదలకు అవి కొట్టుకుపోయిందన్నారు. అప్పటి నుంచి అది అలాగే ఉందన్నారు. వెంటనే సంబంధిత మంత్రి గ్రాయిన్ నిర్మించేందుకు చొరవచూపాలని శాసన సభలో విన్నవించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నందగోపాల్ (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, మార్చి 6 (ఆంధ్రజోతి) : మండలంలోని చవట కండ్రిగ సమీపంలోని 71వ జాతీయ రహదారిపై ఫిబ్రవరి 28 రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయడిన యువకుడు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అక్కగారిపేట గ్రామానికి చెందిన ఇలుపూరు నందగోపాల్ (23), హరికృష్ణ మేనకూరులోని ఓ పరిశ్రమలో విధులు ముగించుకొని తిరిగి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తున్నారు. చవటకండ్రిగ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నారు. గాయపడిన నందగోపాల్‌ను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు, అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నందగోపాల్ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య ప్రజావతి, 5 నెలల చిన్నారి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నై -బెంగళూరు కారిడార్

భూ బాధితులకు రూ.8లక్షల నష్టపరిహారం

సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన



గ్రామసభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కొత్తపట్నంలో గురువారం చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ భూములపై గ్రామసభ జరిగింది. ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలోకి కొత్తపట్నంతోపాటు పలు గ్రామాల్లో ఉన్న 367.90 ఎకరాల ప్రభుత్వ భూములు వెళ్లాయి. ఆయా భూములు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 213 మంది రైతుల సాగులో ఉన్నట్లు గతంలో రెవెన్యూ అధికారులు సర్వేచేసి గుర్తించారు. ఒక్కో ఎకరానికి రూ.8 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో అభ్యంతరాలపై సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను గ్రామాల వారీగా జాబితాను ప్రకటించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వారం రోజుల్లో అన్ని ఆధారాలతో గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయాలని సబ్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఆర్‌ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, సర్పంచ్ తిరుపాలయ్య, ఎంపీటీసీ శేషాద్రి, తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్ రెడ్డి, నెల్లూరు ఏపీఐఐసీ డిప్యూటీ మేనేజర్ శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్తమ సంఘం మహిళా అవార్డుకు ఎంపికైన లక్ష్మి



కోటలో ప్లాస్టిక్ వస్తువుల దుకాణం నడుపుతున్న లక్ష్మి

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం తిమ్మానాయుడు పాళెంలోని విజయలక్ష్మి పొదుపు గ్రూపునకు చెందిన కూరేటి లక్ష్మి ఉత్తమ సంఘ మహిళా అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో గురువారం వెలుగు ఏపీఎం అనీల, పలువురు సీసీలు ఆమెను అభినందించారు. 2008లో పొదుపు సంఘంలో చేరిన లక్ష్మి రూ.5వేల రుణం పొంది తమ కుటుంబ అభివృద్ధికి బాటలు వేసుకుంటూ అంచలంచెలుగా ఎదిగింది. కోట పట్టంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో పటాలు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయాల దుకాణం నడుపుతూ పొదుపు గ్రూపుల నుంచి రుణాలు పొందుతూ వాటిని సకాలంలో చెల్లిస్తూ దారిద్ర్యాన్ని జయించి ఉత్తమ సంఘ మహిళగా నిలిచింది. దీంతో ఆమెకు ఈ నెల 8వ తేదీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఎం చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా మార్కాపురంలో అవార్డును ఇవ్వనున్నారు. దీంతో వెలుగు కార్యాలయంలో లక్ష్మిని అభినందించారు.

90 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి శస్త్ర చికిత్సలు చేసుకున్న రోగులతో వైద్యబృందం, క్యాంపు ఇంచార్జ్ పద్మనాభం

నాయుడుపేట, మార్చి 6 (ఆంధ్రజోతి): నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 6తేదీ వరకు చెన్నైలోని శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో దాదాపు 400 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి అమెరికాలోని కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, శోభారెడ్డి దంపతుల సహకారంతో కీర్తిశేషులు పవనమ్మ జ్ఞాపకార్థంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 90 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేసి కంటి అద్దాలను అందజేశారు. రోగులతో పాటు వారితో పాటు వచ్చిన వారికి భోజన సదు పాయాలను సన్నారెడ్డి విజయ్ మోహన్‌రెడ్డి, లోకనిథ్‌రెడ్డి ఏర్పాటు చేశారు. క్యాంపు ఇన్‌చార్జి చిగురవాడ పద్మనాభం, వైద్మబృదం ఉన్నారు.

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు పీడీ భరత్



చిట్టమూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న భరత్ మహిపతి ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి బెంగళూరు కంఠీరవ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో హ్యామర్ త్రో విభాగంలో భరత్ వెండి పతకం సాధించారు. ఈ నేపధ్యంలో మే నెలలో ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్ పట్టణంలో జరగబోయే ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో భారతదేశం తరపున పాల్గొంటారు. ఎంఈవో బీవీ కృష్ణయ్య, హెచ్‌ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

మన సంస్కృతిని భావితరాలకు అందిద్దాం

ఎన్‌ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి, పక్కనే సుధాకర్‌నాయుడు

తిరుపతి(విద్య), మార్చి6 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, దాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. రైల్వేకాలనీలోని మాతృశ్రీ స్కూల్ 16వ వార్షికోత్సవాన్ని గురువారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏబీవీపీ మాజీ జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ, సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ మహేంద్ర చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు స్కూల్ ఛైర్మన్ డాక్టర్ కె.సుధాకర్‌నాయుడితో కలసి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేటితో ముగియనున్న పోస్టల్ క్యారమ్స్ టోర్నీ

తిరుపతి(క్రీడలు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్టీస్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 27వ ఆలిండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్ శుక్రవారం ముగియనుంది. గురువారం సెమీఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. శుక్రవారం జరగనున్న తుదిపోరులో మహిళల సింగిల్స్‌లో ఆర్.వినిత(తమిళనాడు), నీలమ్‌గోడకే(మహారాష్ట్ర), పురుషుల డబుల్స్‌లో తమిళనాడు నుంచి రెండు, ఒడిశా-తెలంగాణ జట్లు తలపడనున్నాయి. చివరగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం నేడు పీజీసెట్ ఆఫీసు వద్ద ధర్నా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం నేడు పీజీసెట్ కార్యాలయం ముందు విద్యార్థి సంఘాలు ధర్నాకు పిలుపునిచ్చాయి. ఎస్వీయూలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ నేత చలపతి, ఎస్‌ఎఫ్‌ఐ నేత అశోక్, పీడీఎస్‌యూ నేత ఆశ, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేసి, పీజీ అడ్మిషన్ల బాధ్యతను యూనివర్సిటీలకే అప్పగించాలన్నారు. లేకపోతే విద్యార్థులు లేక యూనివర్సిటీలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. పీజీ సెట్ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకేష్, వినోద్, చంద్రనాయక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణకు కృషి చేయాలి

తిరుపతి(వైద్యం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): బాలలపై లైంగిక వేధింపులను నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. రుయా చిన్నపిల్లల విభాగంలో గురువారం బాలల లైంగిక వేధింపులపై అవగాహన, నివారణ నైపుణ్యాలపై పలు శాఖల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపులను నివారించడం, బాధితులకు సహాయం అందించడం గురించి వివరించారు.

మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలి



డీవైఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తిరుపతి(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని సంఘం గౌరవాధ్యక్షుడు గండికోట నాగవెంకటేష్, కోశాధికారి ఇ.శివకుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వారు తిరుపతి అర్బన్ ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, ప్రభుత్వ వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్, ఉద్యోగ విరమణ వయసు పెంపు తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 11వ తేదీన విజయవాడలో చేపట్టనున్న నిరసన దీక్షలో జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డీటీఈఓ షేక్ హసీనా, సీఆర్‌ఎంటీ సభ్యులు వేణుగోపాల్, ధనపాల్, నవీన్‌కుమార్, ఆశాలత, రమాదేవి, రూపావతి పాల్గొన్నారు.

ఐజేబీసీసీ సమావేశాలకు శ్రీసిటీ ఎండీ



ప్రసంగిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని ఫిక్కీ కార్యాలయంలో జరిగిన 48వ ఇండియా-జపాన్ బిజినెస్ కోఆపరేషన్ కమిటీ (ఐజేబీసీసీ), జపాన్-ఇండియా బిజినెస్ కో ఆపరేషన్ కమిటీ (జేఐబీసీసీ) ఉమ్మడి సమావేశాలలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ప్రసంగించారు. పరిశ్రమలు, ప్రాంతీయాభివృద్ధికి ఇండియా- జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంపై జరిగిన ఈ సమావేశానికి జపాన్ నుంచి ఉన్నత స్థాయి పారిశ్రామిక ప్రతినిధులు హాజరయ్యారు. భవిష్యత్తు కోసం సుస్థిర సరఫరా గొలుసు వ్యవస్థను నిర్మించడం అనే ప్లీనరి సెషన్‌లో రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడారు. దేశంలోనే రెండో అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా, శ్రీసిటీలో ఇప్పటికే ఇసుజు, యూనిచార్మ్, డైకిన్, టీహెచ్‌కే వంటి 31 కంపెనీలు, వాటికి విడిభాగాలు సరఫరా చేసే కంపెనీలు ఉన్నాయన్నారు. శ్రీసిటీలో ఓఈఎం కంపెనీలు టైర్ 1, టైర్ 2 విడిభాగాల పరిశ్రమలు ఒకే చోట ఉండడం వల్ల సమర్థత పెరిగి ఉత్పత్తి, లాజిస్టిక్ మరింత సులభతరం అవుతున్నాయన్నారు. పరిశ్రమ, విద్య, స్థిరమైన అభివృద్ధి శ్రీసిటీ దార్శనికతకు నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జపాన్ భారత రాయబారి ఓనో కెయిచీ, భారత జపాన్ రాయబారి శిబిజార్జ్, ఐజేబీసీసీ ఛైర్మన్ ఒంకర్ ఎస్.కన్వార్, జేఐబీసీసీ ఛైర్మన్ తత్సువో యాసునాగా, జపాన్ ఎకనామిక్, ట్రేడ్, ఇండస్ట్రీస్ మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గాకుయెడా పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే చర్యలు

తిరుపతి(వైద్యం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చినా మూడేళ్ల జైలు శిక్ష రూ.50 వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. భారత వైద్యమండలి నుంచి ధృవీకరణ పత్రాన్ని ఐదేళ్లు తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

జగన్ దిష్టి బొమ్మ దహనం



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన నాయకులు

చిల్లకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం మండలంలోని చింతవరం గ్రామంలో జనసే పార్టీ నాయకులు, కార్యకర్తలు జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ కోడికత్తి డ్రామాలను అడ్డం పెట్టుకుని రాజ కీయాలు చేసిన జగన్‌కు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. ప్రజలు బుద్ధి చెప్పేలా తీర్పు నిచ్చినా ఆయన మారకపోవడం శోచనీయమన్నారు. కాగా పిఠాపురంలో ఈ నెల 14వ తేదీన జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో శివాజీ, రవి, మహేష్, క్రాంతి, కార్తీక్, సునీల్, సుధీర్, మోహన్, క్రాంతి, చిన్నా, వేణు, రజినీ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు

కోట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నీలగిరి సంఘం, ఎన్టీఆర్‌కాలనీ, ప్రకాశం కాలనీలోని నిరుపేద గిరిజన మహిళలకు విజయభాస్కర్‌రెడ్డి వితరణతో అయన తల్లిదండ్రులు చీరలు పంపిణీ చేశారు. అలాగే విద్యానగర్ గాంధీ బొమ్మ సెంటర్‌లో టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. స్థానిక యువత ఆధ్వర్యంలో భాస్కర్ రెడ్డిని పూలమాలతో సత్కరించి కేక్‌కట్‌చేశారు.